# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక
వెల : రూ. 10.00
మే 2025




శ్రీ కాళీ వనాశ్రమం, భీమవరం ఆశ్రమశాఖ యందు ప్రతిష్ఠింపబడిన
శ్రీ సద్గురుమూర్తి క్షీర శిలా విగ్రహం

## మార్చి 12 నుండి 17 వరకు భీమవరంలో జరిగిన శ్రీ కాళీవనాశ్రమ శాఖ ప్రారంభోత్సవ దృశ్యములు.



శ్రీ కాళీవనాశ్రమం నుండి అఖండ జ్యోతిని తీసుకొని వెళ్ళుట



ఆశ్రమ శాఖ గృహ ప్రవేశము



ఆశ్రమ శాఖ గృహ ప్రవేశము



సాధు ధర్మ సమ్మేళనము

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ



సంపుటి 44 సంచిక 9
పేజీలు 44
మే 2025

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 8
శ్రీ స్కందదేవానందగిరి స్వామి .............10
వైశాఖ పూర్ణిమ.............................. ..............12
క్లాస్‌మేట్ ..........................................................14
శంఖ-లిఖిత మహర్షులు ...........................16
భగవద్గీత సాధన దీపిక ...........................19
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ....... 22
హనుమజ్జయంతి ..........................................24
పరమహంస యోగానంద.................. ......26
నారద భక్తి సూత్రములు ................ ..............28
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......31
ఉలకడు-పలకడు .............................................32
నిరీక్షణ ..................................................................35
శ్రీ గురుగీత ........................................... .........37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ...................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

**కోతికిశక్యమా యసురకోటుల గెల్వను గాల్చెబో నిజం**
**బాతనిమేన శీతకరుడౌట దవానలు డెట్టివింత? మా**
**సీతాపతివ్రతా మహిమసేవకు భాగ్యముమీకటాక్షము**
**ధాతకు శక్యమా పొగడ దాశరథీ! కరుణాపయోనిధీ!**



భావము :
దాశరథీ! కరుణా పయోనిధీ! నీ అద్భుత మహిమ వలననే ఒక కోతి కోట్లమంది రాక్షసులను గెలిచింది. లంకను కాల్చింది అనుకుంటాము కానీ దావానలమును చలగా అవ్వడం ఎంతటి వింత?. అట్టి నీ మహిమ, సీతాదేవి పాతివ్రత్య మహిమ, వర్ణింప బ్రహ్మకైనను సాధ్యమా!

*పావుశేరు బియ్యం పావుశేరు ఉప్పుతో మధురమైన పాయసం ఎలా తయారయ్యింది?
*కృష్ణమూర్తిగారికి తెలిసిన దొంగల నాయకుడెవరు?
*సత్యానికి నిర్వచనం ఏమిటి?
*ఎవరి నవ్వు చూస్తే మన బాధలు పోతాయి?
*తెరచిన రాముడి నోరు అలాగే ఎందుకు ఉండిపోయింది?
*బాహుదా నదికి ఆ పేరు ఎలా వచ్చింది?
*పరమేశ్వరుని కుటుంబం అంతా ఉన్న చెట్టు ఏది?
*క్షయవ్యాధి గ్రస్తులైన గురువుకు సేవచేసిన శిష్యుడెవరు?
*పరబ్రహ్మను ఎక్కడ వెదకాలి?
*రకరకాల సేవలలో ఏ సేవ చేసేవారు గొప్పవారు?

*సమాధానాలు లోపలి పేజీలలో............................*

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

12-6-1981

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ దర్శనార్థం డాక్టరు కృష్ణార్జున రావుగారు, డా॥ రాయలేశ్వర్లుగారు వచ్చారు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'మీరు నా దర్శనార్థం వచ్చారు. నాలో ఏముంది గొప్పతనం. నేను ఏం చేస్తున్నానని నన్ను గొప్పవాడిగా భావిస్తున్నారు?' అని ప్రశ్నించారు.



డాక్టరుగారు మాట్లాడుతూ 'అదేమిటి బాబూ! అలా అంటారు. మీరు మహాత్ములు' అన్నారు.

'నన్ను మహాత్ముడిగా ఎలా గుర్తించారు? అలా గుర్తించాలని నా ఉద్దేశ్యంకాదు. నాకన్నా మీరే గొప్పవారు. మీరు ఏదో విధంగా ప్రజలకు ఉపయోగ పడుతున్నారు. నేను అక్షరాభ్యాసము చేసిన ఒక వ్యక్తి తాను ఉద్యోగస్థుడు అయినట్లుగా ఉత్తరం వ్రాశాడు. నేను చాలా సంతోషించాను. నేను చూడండి ఇలాగే ఏ ప్రమోషను లేకుండా ఉన్నాను' అని అన్నారు శ్రీ బాబూజీ. శ్రీ బాబూజీయే తిరిగి "ఆశ్రమంలో ఆలయాలు దర్శించండి. నా శక్తినంతా ధారపోసి ప్రతిష్ఠ చేసిన దేవతామూర్తులు అక్కడ వేంచేసి ఉన్నారు' అన్నారు. డాక్టరు సమాధానం చెప్తూ 'ముందుగా మీ దర్శనం చేసుకుందామని వచ్చాము' అన్నారు.

'జగన్మాత దృష్టిలో అంతా సమానమే. ఒక్కొక్కరికి ఒక్కొక్క సేవచేసే భాగ్యాన్ని కలుగజేస్తుంది. భగవానునికి పక్షపాతబుద్ధి అని కొంతమంది భావిస్తారు. జగజ్జనని నన్ను ఈ విధంగా జ్ఞాన ప్రబోధం చేయమని ఆజ్ఞాపించింది. ఇంకొకరిని వేరొక సేవ చేయమంది. ఇందులో ఎవరు గొప్ప? అందరూ భగవానుని దృష్టిలో సేవకులే. మీరు వైద్య వృత్తిలో ఉన్నారు. మీకు ఈ విధమైన సేవచేసే భాగ్యాన్ని ఆ జగజ్జనని ప్రసాదించింది. అయినా ఈ సేవ చేసేది ఎవరు? సేవచేసేది మీరా?

లేక మీలో చైతన్యమా? సమస్త కార్యములు చేసేది ఆ చైతన్యమే అయినప్పుడు మీ గొప్పతనం ఏముంది? నా గొప్పతనమేముంది?' అని శ్రీ బాబూజీ ప్రశ్నించారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ 'రామకృష్ణ పరమహంస శిష్యుడు నాగమహాశయుడు ఉండేవాడు. అతను వైద్యుడు. రోగుల వద్ద నుండి ధనాన్ని స్వీకరించేవాడు కాదు. రోగులు ఆయన్ని కనీసం మీరు తిరగటానికి అవసరమయ్యే వాహనం ఖర్చు తీసుకోమనేవారు. ఆయన దాన్ని కూడా తిరస్కరించేవాడు. భగవంతుడు ఇచ్చిన అవయవాలు సరిగా ఉన్నప్పుడు ఇక వాహనము ఎందుకు? అని ప్రశ్నించేవాడు. అవయవాలు పనిచేయటానికి కావలసిన శక్తి ఇచ్చేది ఆ పరమాత్ముడే కదా! మరి రోగుల వద్దనుండి ధనాన్ని వసూలు చేయటం ఏం న్యాయం? అని ప్రశ్నించేవాడట. ఇంతటి ఉన్నత భావాలుగల నాగమహాశయుడు ఎటువంటివాడో మీరే ఊహించండి. అయితే మీ ఉద్దేశ్యంలో ఎవరు గొప్పో చెప్పండి. రామకృష్ణ పరమహంసా లేక నాగమహాశయుడా?' అని శ్రీ బాబుజీ ప్రశ్నించారు. దీనికి సమాధానం మీరు చెప్పలేరులెండి. మన అందర్నీ పుట్టించిన ఆ జగజ్జనని అందరికన్నా గొప్పది. పదండి ఆమె దర్శనము చేసుకొని వద్దాం అని ఆ డాక్టర్లను శ్రీ రామలింగేశ్వర ఆలయం, శ్రీ కాళీమాత ఆలయాలకు తీసుకు వెళ్ళారు.

తర్వాత ప్రార్థనా మందిరంలో అంతా కూర్చున్నాం. 'సాందీపని అంటే ఎవరు?' అని శ్రీ బాబు ప్రశ్నించారు. 'ఆయనకు శ్రీ కృష్ణ పరమాత్మ గురించి తెలియదనుకున్నారా? అలాగే వసిష్ఠులవారికి శ్రీరామచంద్రుని గురించి తెలియదనుకున్నారా? వారిరువురు మహాజ్ఞానులు. అయితే వారి భాగ్యమే భాగ్యము. ఆ పరమాత్మకి వారు గురువులయ్యారు. శ్రీకృష్ణుడు సాందీపని వద్ద విద్యాభ్యాసము పూర్తిచేసి సెలవు తీసుకొని వెళ్ళేటప్పుడు సాందీపని భార్య ప్రోద్బలంచేత చాలాకాలంక్రితం సముద్రంలో మరణించిన తన పుత్రుణ్ణి గురుదక్షిణగా తెచ్చి ఇమ్మంటాడు.

బలరామకృష్ణులు తమ గురువుయొక్క కోర్కెను విని తమ గురుపుత్రుణ్ణి తెచ్చి ఇమ్మని సముద్రుని ఆజ్ఞాపిస్తారు. సముద్రుడు రామకృష్ణులకు నమస్కరించి రామకృష్ణుల గురుపుత్రుణ్ణి పాంచజన్యుడు

అనే రాక్షసుడు కాజేశాడని తెలియజేస్తాడు. పాంచజన్యుడు మహాభక్తుడు. అయితే శాపగ్రస్తుడు. తన అపరాధాన్ని క్షమించమని కోరిన వెంటనే దయాస్వరూపుడు, కరుణామయుడు అయిన శ్రీకృష్ణ పరమాత్మ క్షమిస్తాడు. చివరికి శ్రీకృష్ణుడు తన గురుమూర్తి కోరినట్లుగా గురుపుత్రుణ్ణి యమధర్మరాజు వద్దనుండి తీసుకొని వచ్చి ఇస్తాడు. సాందీపని శ్రీకృష్ణుని అవతారమూర్తిగా ఎరుగును కాబట్టి అట్టి గురుదక్షిణ కోరాడు' అన్నారు.

శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ 'శ్రీకృష్ణ పరమాత్మునికి గోపికలంటే అమితమైన ప్రేమ. ఎందుకో చెప్పగలరా?' అని ప్రశ్నించారు.

గోపికలు వంశీధరుడిని ఎల్లవేళలా ధ్యానిస్తూ ఉంటారు. వంశీధరుడు అంటే అందరి వంశాలని ఉద్ధరించేవాడు, అందరి వంశాలను కాపాడేవాడు. వంశీధరుడు వెదురు గొట్టము ద్వారా ఆనందాన్ని ఇచ్చేవాడు. వెదురు గొట్టములో ఏముంది? ఏమీలేదు. ఏమీలేని వెదురు గొట్టములోంచి నాదము పలికించి అందరిని మోహపరుస్తాడు. మన శరీరం మాత్రం ఏమిటి? ఇదీ ఒక వెదురు గొట్టమే. ఈ వెదురు గొట్టానికి చైతన్యాన్ని ఇచ్చేది ఎవరు? శ్రీకృష్ణ పరమాత్మయే.

శ్రీకృష్ణుడు ఘన శ్యామసుందరుడు, ఘనశ్యాముడు. అంటే మేఘమువంటి చల్లని కాంతిని ఇచ్చేవాడు. మేఘము ఎలా వర్షిస్తుందో అలాగే చల్లని కాంతిని వర్షింపజేసి అందరిని ఆనందపరవశులను చేసేవాడని అర్థము. కృష్ణకాంతి అజ్ఞానాన్ని తొలగించి ఆనందాన్ని ఇస్తుంది. రవి కాంతి చీకటిని తొలగిస్తుంది కాని అజ్ఞానాన్ని తొలగించలేదు. శ్రీకృష్ణ కాంతియే ఆత్మకాంతి. అది అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదిస్తుంది.' అన్నారు శ్రీబాబు.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## ఇసుక దిబ్బలో పడిన సూది దొరుకుతుందా?

"మనసు నిరంతరం సత్య వస్తువుతో రమించడమే సత్సంగం. సత్సంగమనేది అనేకమంది వున్నా, ఇద్దరే వున్నా, లేక ఒక్కళ్ళే వున్నా కూడా జరుపుకోవచ్చు. మార్పు లేనటువంటిది 'సత్యవస్తువు'. దానినే పరబ్రహ్మమనీ, భగవంతుడనీ, గురువనీ, చైతన్యమనీ, ఆత్మ అనీ అంటారు. ఎన్ని పేర్లతో పిలిచినా ఉన్నది ఒక్కటే సత్యవస్తువు. అదే పరబ్రహ్మతత్త్వం. అది కేవలం గ్రంథాలు చదివి, వల్లించినంత మాత్రాన అబ్బేది కాదు. అది అనుభవైక వేద్యమైనదని చెబుతూ శ్రీ గురుదేవులు ఒక చిన్న కథ చెబుతూండేవారు.



"అనేక గ్రంథాలలో తలదూర్చి తదేక దీక్షతో చదువుకుంటూ వున్న ఒక తాతగారి దగ్గరకు, ఆయన మనుమరాలయిన చిన్నపిల్ల వెళ్ళి 'తాతగారూ, తాతగారూ! మీరు దేనికోసం వెదుకుతున్నారండీ?' అని అడిగేసరికి, ఆ తాతగారు, 'అమ్మా! నేను పరబ్రహ్మవస్తువు కోసం వెదుకుతున్నానే' అని అంటారు.

కొద్దిసేపు పోయాక, ఆ ముసలాయన బయటకు వచ్చి చూసేసరికి, ఆయనను ప్రశ్నించిన మనుమరాలు ఒక ఇసుక గుట్ట దగ్గర కూర్చుని దేనికోసమో వెదుకుతూ వుండటం కనిపిస్తుంది. అప్పుడాయన, ఆ పాపని, దేనికోసం వెదుకుతున్నావని అడిగేసరికి, ఆ పిల్ల, 'తాతా! నేను యీ యిసక దిబ్బలో సూదిని పోగొట్టుకున్నాను. ఆ సూది కోసం వెదుకుతున్నాను' అని అంటుంది. ఆ తాతయ్య నవ్వి, 'సరిసరి, ఆ యిసుకలో నీ సూది దొరికినట్టేగాని, లేవే' అని అంటే ఆ పాప, "తాతయ్యా, గ్రంథాలలో నీకు పరబ్రహ్మ వస్తువు దొరకగా లేనిది, ఈ ఇసుకలో నా సూది మాత్రం దొరకదా!" అని అంటుంది.

ఆ తాతగారు పండితుడు, విజ్ఞుడు కనుక, ఆ పాప అన్న దానిలోని సత్యాన్ని గ్రహిస్తాడు. పరబ్రహ్మ వస్తువు గ్రంథాలలో వెదికితే దొరికేది కాదు.

అది 'అనుభవైక వేద్యం'. పంచదార తెల్లగా వుంటుంది, తియ్యగా వుంటుంది, అని దాని గురించి ఎన్ని పేజీలయినా వ్రాయవచ్చుగాని, 'తీపి' అంటే ఏమిటో అది తినినవాడికే తెలుస్తుంది. పరబ్రహ్మ వస్తువుని అర్థం చేసుకోవాలంటే, దానిని అనుభవించాలి. అది అనుభవించాలి అంటే, పరబ్రహ్మానుభవం పొందినటువంటి మహాపురుషులని, సద్గురువులని ఆశ్రయించి, వారి ద్వారా శ్రవణం చేసి, విన్న దానిని మననం చేసుకుంటూ, ఆచరణలో పెట్టాలి. పరమాత్మునిలో వున్న అనంత కళ్యాణ గుణాలని అలవరచుకోవాలి.

ఆయనలో లేనటువంటి ఈర్ష్య, అసూయ, అసహనము, ఓర్వలేనితనము, కామక్రోధాది గుణములు మనలో లేకుండా చేసుకోవాలి. ప్రపంచంలోనే వుంటూ, అందులోనివి అనుభవిస్తూ, ప్రపంచాన్ని మట్టుకు మనసులోనికి రానీయకూడదు. అంటే, పడవ నీళ్లల్లోనే వుంటుంది కాని పడవలోనికి నీరు రాకూడదు. పడవలోనికే గాని నీళ్ళు వస్తే, అది సాగరం పాలయినట్టు, మన మనసులోనికి ప్రపంచం వస్తే, మనకి వినాశనం తప్పదు. ఏ మహాత్ముడూ కూడా, సంసారాన్నీ, దారా పుత్రాదులని వదిలేయాలని చెప్పలేదు. సంసారంలోనే వుంటూ, దారాపుత్రాదులని పోషించుకుంటూ, స్వధర్మాన్ని ఆచరిస్తూ, కోరికలని విడిచిపెట్టాలి. ఎంతో లోతయిన వేదాంతార్థాలని ఉపదేశించిన గీతాచార్యుడు అర్జునుడిని సన్యసించమని చెప్పలేదే! పైగా అతడికి స్వధర్మమైన యుద్ధం చేయమని ఆదేశించాడు. అవతార మూర్తులయిన రాముడు, కృష్ణుడు కూడా సంసారంలోనే వుండి, అనేక బాధ్యతలని నిర్వహిస్తూ, ధర్మాన్ని చాటారు.

ఇటువంటి పరబ్రహ్మ తత్వమును గురించి తెలుసుకోవడమే, తమ నిజతత్వాన్ని తెలుసుకోవడం. ఏలన, పిపీలికాది బ్రహ్మ పర్యంతం వ్యాపించివుండి, వాటినన్నింటినీ ప్రకాశింప చేస్తున్నది ఒకే చైతన్యం కనుక, ఆ మార్పులేనట్టి సత్య వస్తువుని, సద్గురువుల నాశ్రయించి, వారు ఉపదేశించిన లక్ష్యార్థ సాధన ద్వారా పొందవచ్చు. అట్టి గురుపాదుకలు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి సర్వులనూ కాపాడుగాక!"

## శ్రీ స్కందదేవానందగిరి స్వామి - తుళ్ళూరు

- సేకరణ భాగవతుల హనుమత్ జయప్రద

**అమ్మలకుఅమ్మ జగదంబ నేడు విశ్వావధూతయై అవతరించి కాళీ వనాశ్రమాధిపతియై వెలుంగ సాధుసత్తములెల్ల బ్రోవగ అరయ పార్వతీపరమేశ్వరుల ఆనతి చొప్పునన్ అవతరించి భువిని ఎల్లర గాయగ శిష్టార్తిజనుల బ్రోవగనెంచి తాధరిత్రినిన్ ధరించి ముక్తాబాయి సహేతు ముక్తి కాంతుల కావ ఎల్లరన్ తాను ముక్తి పదము పొందినదియై అందరికి ఆ ముక్తిని ప్రసాదించే అమ్మలగన్న మన అమ్మ ఇక్కడ ఆసీనులై ఉన్నారు. అటువంటి అమ్మ ఈ పద్యమును పాడుతున్నారు.**

**ఆత్మ వెళ్ళిన దేహము అగ్నిహోత్రుని పాలు**
**కఠిన శల్యములెల్ల గంగ పాలు**
**మీద కప్పిన బట్ట మేటి చాకలి పాలు**
**ఇల్లు సొమ్ములెల్లను ఇతరులపాలు**
**భ్రష్ట పెండ్లామున్న పరులపాలు**
**పాపములొనరించు జీవుడు యముని పాలు**
**ఏదీ నీవెంట రాదురా ఎఱుగుము మూఢ**

పాపము చేసిన వాడు యముని పాలు అవుతున్నారు. పాపమును పోగొట్టుకోవాలి అంటే ఇక్కడ ప్రతి ఒక్కరు ఎవరిని ఆశ్రయించాలి అని చెప్పారు? గురుదేవుని ఆశ్రయిస్తే, గురుపాదములని సదా ధ్యానిస్తే, అదే మోక్షానికి హేతువు అవుతున్నది.

అయితే ఇంతటి మహత్తరమైన కార్యక్రమము జరుగుతున్నది కదా, ఇది అయిపోగానే వెళ్ళిపోవాలి అనుకోకుండా, స్వామివారి సన్నిధానంలో ఉండి తరించాలి అని ఎవరైతే అనుకుంటారో వారికోసమే ఈ ఆవాసాలు ఏర్పాటు చేస్తున్నారు.

**అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః।**
**నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మసంగ్రహః॥**

అహర్నిశము కూడా భగవత్తత్త్వమును గురించి విచారించాలి, అంతే తప్ప మేము పుస్తకాలు చదువుతున్నాము, గ్రంధాలు చదువుతున్నాము అంటే కుదరదు. మాకు గురుసన్నిధానంలో ఉంటే విషయాలు చాలా అర్థం అయినట్టు ఉంటాయి, ఆ తర్వాత అవి ఏమీ

గుర్తుండవు అని అంటూవుంటారు. గురుదేవుల యొక్క దివ్యమైన తపో శక్తి చేత, అనుగ్రహము చేత, వారి మంత్రబలము చేత, వారి దృష్టి ప్రభావము చేత, వారి స్పర్శ చేత, ఆ ప్రసన్నత చేత, నీకు అన్ని అవగత మయినట్లు అనిపిస్తాయి. అంటే ఆ గురుదేవుల (భగవంతుడికి) దగ్గరగా ఉంటే మరపు రాదు. స్మృతిపథం నుండి ఎప్పుడూ తప్పకోవు. వారి నుండి దూరం అయినప్పుడు మరచిపోయే అవకాశం వున్నది. అందుకనే సద్గురుదేవుల దివ్య సన్నిధానం ఉండాలి. దీనికే గురుదేవుని ఎలా సేవించాలి అంటే దీపకుడు అనే ఒక శిష్యుని కథ ఒకటి ఉన్నది.

దీపకుడు అనే ఒక శిష్యుడు ఉన్నాడు. ఆయన అందరి శిష్యులలో బాగా తెలివైనవాడు. అయితే అతని గురువుగారు ఒక పరీక్ష పెట్టదలిచారు. ఒకరోజు శిష్యులని పిలిచి, 'నేను ఒక గొప్ప జన్మాంతర దోషము వలన క్షయవ్యాధి గ్రస్తుడిని అవుతున్నాను. నన్ను కాశీకి తీసుకుని వెళ్ళి, అక్కడ చిన్న పర్ణశాల వేసి, ఆ తర్వాత నమ్మకమైన శిష్యులు మీలో ఎవరైనా ఉంటే, ఆ ఒక్కరు వచ్చి సేవ చేస్తే, పుణ్యకాలాన్ని నేను పొందితే, ఈ దోషం పోతుంది. నేను ముక్తుడిని అవుతాను. ఆ భాగ్యానికి నన్ను దగ్గర చేసేటువంటి శిష్యుడు ఎవరు?' అని అంటారు. అమ్మో! ఆ వ్యాధి ఎట్లా ఉంటుంది అండి?

**శరీరమంతయు రక్త సిక్తమై , చీమున్ గ్రోలుచున్ దుర్వాసనల్ వెడలుచున్ ఏ క్షణమున్ మానసమున ఇంత సంతసమున్ గానక వేరొక దర్పణంబున అతి హేయమై హీనమై ప్రబలు వాచాలాతలంబునన్ ప్రక్కల ఉండెడి వారలు వీరులనుభావము నొప్పక దండింపచూచుచున్.**

శరీరం అంతా రక్తసిక్తమై, చీముతో, బాధతో, పురుగులు తింటూ ఉంటే, కోపాన్ని భరించలేని జీవుడికి, కర్కశంగా మారుతుంది హృదయము. అప్పుడు బాగా ఆలోచించిన శిష్యులు, 'మేము అలాంటి సేవ చేయలేము' అని అన్నారు. అప్పుడు దీపకుడు మాత్రమే, 'నేను మీ సేవ చేసుకుంటాను స్వామీ!' అని అంటాడు.

- సశేషం

# వైశాఖ పూర్ణిమ - పాలూరి కాళీప్రసాద్

పూర్ణిమ నాడు చంద్రుడు విశాఖ నక్షత్రంలో ఉంటే దానిని వైశాఖమాసం అంటారు. శాఖలు అంటే చెట్టు కొమ్మలు అని మనకు తెలుసు కదా. మరి విశాఖ అంటే కొమ్మలు లేని చెట్టు. అసలు ఏమిటీ చెట్టు అంటే భగవద్గీతలో స్వామి చెప్పాడు.

**ఊర్ధ్వమూలమధః శాఖమశ్వత్థం ప్రాహురవ్యయమ్।**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్॥**

సంసారమనే అశ్వత్థ వృక్షానికి మూలం పైన ఉంటుందిట, కొమ్మలు క్రిందకి విస్తరించి ఉంటాయిట. దీని గురించి కొంచెం ఆలోచిస్తే అసలు సంసారానికి మూలం నువ్వే. 'నేను' అంటూ ఉన్నప్పుడే 'నాది' అనే ఈ సంసారం అంతా ఉంటోంది. నేనే లేకపోతే సంసారం ఎక్కడిది? అయితే అసలు 'నేను' అయిన ఆత్మను వదిలివేసి మనం ఈ శరీరమే నేను అనుకుంటున్నాం. ఇక ఈ శరీరానికి సంబంధించిన వస్తువులు, వ్యక్తుల మీదకి మన ఆలోచనలు శాఖోపశాఖలుగా విస్తరించి వెళ్ళిపోతూ ఉంటాయి. అందుకే సంసారం మనని బంధిస్తోంది.

మనం ఎప్పుడైతే క్రిందికి (ప్రపంచం వైపుకి) చూడడం మానేసి పైన ఉన్న మూలాన్ని పట్టుకుంటామో అప్పుడు ఈ శాఖలన్నీ వాటంతటవే రాలిపోతాయి. అయితే దీనికి ఏకాగ్రబుద్ధి అవసరం. అదే భగవద్గీతలో స్వామి చెబుతూ.....

**వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన ।**
**బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽ వ్యవసాయినామ్॥**

'నీ కృషి ద్వారా, ఆధ్యాత్మిక సాధన ద్వారా బుద్ధిని ఆత్మయందు ఏకాగ్రం చెయ్యి అర్జునా! సాధన లేని బుద్ధి అనేక శాఖలుగా విస్తరించి అనంతంగా ప్రపంచంలో వ్యాపిస్తుంది' అని చెబుతున్నాడు. మనకు నిరంతరం మనస్సులో అనేక సంకల్పాలు వస్తూనే ఉంటాయి కదా! అయితే ఆ సంకల్పించిన పని మంచిదా, కాదా? ఇది చేయవచ్చా, చేయకూడదా? అని విచారించి నిర్ణయించేది బుద్ధి. ఎప్పుడైతే ఈ బుద్ధిని మూలపదార్థమైన ఆత్మయందు నిలుపుతామో అప్పుడది ఈ అనిత్యమైన ప్రాపంచిక విషయాలను దానంతటదే వదిలివేస్తుంది. జీవితంలో ప్రతి అడుగులోనూ సరైన నిర్ణయాలు తీసుకొని మనను ఆధ్యాత్మిక పథంలో నడిపిస్తుంది. నిజమైన వైరాగ్యం అంటే ఇదే కదా.

అందుకే స్వామి ఈ సంసార వృక్షాన్ని '**అసంగ శస్త్రేణ దృఢేన ఛిత్వా**' దృఢమైన వైరాగ్యమనే ఆయుధంతో తెగనరకాలని సూచిస్తున్నారు.

పరమేశ్వరుని నామాలలో '**ఓం స్థాణవే నమః**' అనే నామం ఒకటి. స్థాణువు అంటే ఏ కొమ్మలూ లేని చెట్టు మొదలు. బుద్ధి ప్రపంచంలోకి శాఖోపశాఖలుగా విస్తరించకుండా నిరంతరం తనలో తాను రమిస్తూ సమాధి స్థితిలో ఉంటాడు కాబట్టి ఆయన స్థాణువు. ఈ వృక్షానికి కొమ్మలు లేకపోవడం అనే గుణమే '**విశాఖ**'. అది కుమారస్వామి నామం. కొమ్మలే లేకపోతే ఇక ఆకులు ఎక్కడినుంచి వస్తాయి. అలా ఆకులు లేకపోవడం అనే గుణమే '**అపర్ణ**'. ఇది పార్వతీదేవి నామం కదా! ఇలా బుద్ధి ప్రపంచంలోకి విస్తరించకుండా ఆత్మయందు లగ్నమయినప్పుడు ఆ ఆత్మ సర్వవ్యాపకమయినది కనుక '**నీవు చూచునదెల్ల నీవే**' అనే విశ్వవ్యాపక అనుభూతి కలుగుతుంది. అదే '**విఘ్న**'. ఇది గణేశుని నామం. ఇలా సంసారంలోనే ఉంటూ దేనికీ అంటకుండా నిరంతర ఆత్మానందాన్ని ఎలా అనుభవించవచ్చో ఆది కుటుంబమైన పరమేశ్వరుని కుటుంబం మనకు సూచిస్తోంది.

అలాగే మనోసంసారాన్ని విడిచిపెట్టి ఏకాగ్రబుద్ధితో సాధన చేస్తే ఈ సంసార వృక్షమే బోధివృక్షమై నీలో జ్ఞాన ప్రబోధం కలుగుతుందని నిరూపించిన **బుద్ధభగవానుని జయంతి** కూడా ఈ వైశాఖ పూర్ణిమ రోజునే. శత్రువు జాడ పొడసూపగానే తాబేలు తన ఇంద్రియాలను లోపలికి లాక్కొని ఎలా రాయిలా మారిపోతుందో ప్రజ్ఞావంతుడయిన మానవుడు తన ఇంద్రియాలను అలా విషయాలనుండి లోపలికి లాక్కొని తనను తాను రక్షించుకోవాలని గీతలో స్వామి చెబుతాడు. అటువంటి **కూర్మావతారం** వచ్చినది కూడా ఈరోజే. అలాగే సంసారంలో ఉన్న మానవుడు ఎలా భక్తి జ్ఞాన వైరాగ్యములను పెంపొందించుకొని ఆత్మానంద ఫలాన్ని అందుకోవాలో మనందరికీ ప్రత్యక్షంగా నిరూపిస్తూ శృంగార, భక్తి, జ్ఞాన, వైరాగ్య పూరితమైన 32 వేల సంకీర్తనలు తెలుగువారి ఇలవేలుపైన ఆ వేంకటేశ్వరునిపై రచించిన **అన్నమాచార్యుల వారి జయంతి** కూడా ఈరోజే.

కాబట్టి ఈ వైశాఖ పూర్ణిమ మనందరికీ అటువంటి వైరాగ్యాన్ని, ఏకాగ్ర బుద్ధిని ప్రసాదించి మన సాధనను పురోగమింపజేయాలని శ్రీ సద్గురుమూర్తిని ప్రార్థిద్దాం.

# క్లాస్‌మేట్

- పాలూరి ప్రసాద్

సమర్థ సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్ వారిచే క్లాస్‌మేట్ అని పిలిపించుకున్న ధన్యజీవి శ్రీ చల్లా వెంకట రమణ బాబు (రమణ ప్రసాద్) గారు. శ్రీగురుదేవులకు పితృసమానులైన శ్రీ కందర్ప పరశురామయ్య గారి కుమార్తె శ్రీమతి చల్లా సీతమ్మగారు, అల్లుడు శ్రీ చల్లా కృష్ణమూర్తి గారల ఏకైక సంతానం ఆయన. ముక్తపురుషులైన తాతగారి పరంపర, తల్లిదండ్రుల అమోఘ సాధన ఫలితంగా రమణబాబుగారికి వుత్తమ సంస్కారం అబ్బింది. ఒకసారి శ్రీ పరశు



రామయ్యగారు రమణబాబు గారిచే ఏబిసిడిలు దిద్దిస్తూ శ్రీబాబును కూడా "మీరు అఖండ జ్ఞాన సంపన్నులే కానీ ఈ జ్ఞానాన్ని దేశవిదేశాలలో పంచిపెట్టాలంటే ఇంగ్లీషు రావడం చాలా ముఖ్యం. కాబట్టి ఈ పలకమీద నేను వ్రాసిన ఇంగ్లీషు అక్షరాలు దిద్దండి బాబూ!" అన్నారు. అయితే శ్రీబాబుకు ఆ పలకలో జగన్మాత దర్శనమిచ్చి "సర్వ విద్యలకు అధిపతినైన నేను ఉండగా నీకు ఈ ప్రాపంచిక చదువులెందుకు?" అనడం, అక్కడితో వారి విద్యాభ్యాసం ముగియడం జరిగింది.

ఇదే విషయాన్ని శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో ఒకనాడు తమ బోధామృతం మధ్యలో గుర్తు చేసుకొంటూ శ్రీగురుదేవులు శ్రీ రమణబాబుగారిని లేపి "వీడు నా క్లాస్‌మేట్! ఆనాడు చదువు నేర్చుకోక నేను ఇలా ఉన్నాను. వీడు పెద్ద పెద్ద చదువులు చదివి ఇప్పుడు పెద్ద ఆఫీసర్ అయిపోయాడు" అన్నారు. దానికి శ్రీ రమణబాబుగారు "ఇదంతా తమరి అనుగ్రహమే బాబూ!" అని వినయంగా సమాధానం ఇచ్చారు. ఆనాడు పలకలో జగన్మాతను దర్శించలేకపోయినా ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సమేతంగా ఆశ్రమవాసులయి, నిరంతర ఆశ్రమ సేవ చేసుకొంటూ, తాము చేసే ప్రతి సేవలో జగన్మాతను దర్శించడం నేర్చుకొన్నారు శ్రీ రమణబాబుగారు.

ఆశ్రమ ట్రస్టుకు గౌరవ కార్యదర్శిగా, సమర్థ సద్గురు మాసపత్రికకు ప్రచురణ కర్తగా, రచయితగా, చిత్రలేఖకునిగా, సంపాదక వర్గ సభ్యుడిగా విశేష సేవలు అందించారు. భౌతికంగా ఎన్ని అనారోగ్యాల

పాలైనా ఏనాడూ వాటిని తమ సేవకు అడ్డు రానీయలేదు. కాన్సర్ కారణంగా వారి నాలుకలో సగభాగం తొలగించబడినా, అంతకు పూర్వం కంటే రెట్టించిన ఉత్సాహంతో ఎన్నో క్రొత్త విషయాలను సేకరించి, వాటికి సంబంధించిన పాటలను సైతం నేర్చుకొని, పాడుతూ వుపన్యసించేవారు. శ్రీ కాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో సేవలు అందిస్తూనే, ఆశ్రమంలో జరిగే ప్రతి గురుపూజలో, సత్సంగంలో విధిగా పాల్గొనేవారు. శ్రీ మాతాజీ వారి, ఇతర మహాత్ముల బోధామృతాన్ని చక్కగా వ్రాసుకొని తెలుగు, ఆంగ్ల మాసపత్రికలకు అందించేవారు.

ఎందరో మహాత్ముల, మహాభక్తుల జీవిత చరిత్రలను సేకరించి, క్రోడీకరించి విష్ణుకథలు పేర మూడు భాగాలుగా రచించారు. అలాగే శ్రీకృష్ణుడి అవతార పరిసమాప్తి సమయంలో ఉద్ధవుడు, రాధ, అక్రూరుడు మొదలైన వారి మనస్థితి ఎలా ఉందో అద్భుతంగా ఆవిష్కరిస్తూ గుజరాతీలో దినకర్ జోషీ గారు రచించి, హిందీలోకి నందిని మెహతా గారు అనువదించిన గ్రంథాన్ని తెలుగులోకి చక్కగా అనువదించి 'శ్యామసుందరా! ఒక్కసారి! ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ...' అన్న పేర ప్రచురించారు. అశేష భక్తజనావళిలో వివిధ భక్తులకు శ్రీగురుదేవులతో పరిచయం, వారు పొందిన దివ్యానుభవాలను శ్రీ విజయేంద్ర ప్రసాద్ వారు ఎంతో శ్రమతో సేకరించి మనకందించిన 'శ్రీ సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర' రెండు భాగాల పరంపరను కొనసాగిస్తూ మూడవ భాగాన్ని శ్రీ రమణబాబుగారు మనకందించారు. అలాగే వారు సేకరించిన భక్తుల అనుభవాలను 'గురు కృపాహి కేవలం' అన్న శీర్షికన మాసపత్రికలో ప్రచురించడమే కాకుండా వారు శ్రీగురు సాయుజ్యాన్ని పొందే కొద్ది రోజుల ముందే పుస్తక రూపంలో మనకందించారు.

ఇలా శరీరాన్ని మరచి నిరంతరాయంగా గురుసేవ, ఆశ్రమసేవ, భక్తుల సేవ చేసుకోవడం కంటే మోక్షం వేరే ఎక్కడో లేదు కదా! అలా తమ జీవితాలతో మనకు ప్రత్యక్ష మార్గదర్శకులైన శ్రీ రమణబాబు (రమణ ప్రసాద్) గారి వంటి పరమ భక్తులు చూపిన బాటలో నడచి మన జీవితాలను ధన్యం చేసుకోవడమే వారికి మనం అర్పించే నిజమైన నివాళి.

# శంఖ-లిఖిత మహర్షులు

\- సన్నిధానం కాళీమాత

'అధర్మం మనం చేసిన తరువాత ఇంకొకరికి ధర్మం గురించి ఎలా బోధించగలం?'

శంఖుడు అనే ఋషి తన తమ్ముడైన లిఖితుడు అనే ఋషితో అన్న మాటలివి. నిజానికి లిఖితుడు చేసిన అధర్మం ఏమిటి అని విచారిస్తే అది మనకు పెద్ద అధర్మంగానే తోచదు. ఎందుకంటే మన పెద్దలు అయిన ఋషులు మనని ఏ ధర్మ మార్గంలో వుండమన్నారో, అటువంటి ధర్మాలలో మనం అతిక్రమించని ధర్మమే లేదు అనటం అతిశయోక్తి కాదు అనిపిస్తుంది. అందువలన ధర్మమార్గంలో వెళ్ళిన ఋషులను మనం స్మరిస్తే, దివ్యదేహములతో మన మధ్యనే సంచరిస్తూ వున్న ఆ ఋషిపుంగవులను, అటువంటి ధర్మమార్గములో వెళ్ళేటటువంటి మనో, బుద్ధి చిత్తములను అనుగ్రహించమని ప్రార్థిస్తే, వారు మనకు అవి ప్రసాదిస్తారు. ఎందుకంటే మనం ఇక్కడ మన శరీరాలతో వుండగానే, అధర్మ ప్రవర్తన వలన వచ్చిన పాపప్రక్షాళన చేసుకోకపోతే, ఈ జీవుడు ఈ శరీరాన్ని వదలిపెట్టిన తరువాత యమదండనమనే దుఃఖానికి లోనవటమే కాక, సాధన పరిపక్వతకి మరికొన్ని జన్మలు తీసుకోవల్సి రావచ్చు.

బాహుదానదీ తీరంలో నివసించే ఒక బ్రాహ్మణుడు, తన వాటికలో ధర్మపత్నీ సమేతంగా తపస్సు చేసుకుంటున్నారు. వారి తపఃఫలంగా వారికి ఇద్దరు కుమారులు కలిగారు. మొదటివాని చేతిలో జ్ఞానయోగి చిహ్నమైన శంఖం ఉండటం వలన అతనికి శంఖుడు అనీ, రెండవవాని నుదుటిపైన గొప్ప తపోదీక్షా పరతంత్రుడని తెలిపే గుర్తులు వుండటం వలన అతనికి లిఖితుడనీ నామకరణం చేశారు.

వారిద్దరూ వేదశాస్త్రాలు అన్నీ చదువుకుని, ఉత్తములై, ఒకరిపై మరొకరు అత్యంత ప్రీతితో, తల్లిదండ్రులను భక్తితో సేవిస్తూ వుండేవారు. కొంతవయస్సు వచ్చాక, తల్లిదండ్రుల అనుమతితో జ్ఞాన సంపాదన నిమిత్తమై అడవిలో తపస్సు చేసుకోవడానికి, ఆ నదీ తీరంలోనే కొంత దూరంలో అరణ్యంలో చెరి ఒక ఆశ్రమం నిర్మించుకుని, బ్రహ్మచర్యదీక్షతో నివసించసాగారు. అతి ఉత్తమమైన తపస్సు చేసుకుంటూ, వారిరువురు సత్యాన్వేషణలో పరస్పరం తమ అనుభవాలు పంచుకుంటూ, ధర్మాన్ని గురించి చర్చలు జరుపుకుంటూ నరనారాయణుల వలె వెలుగొందారు.

ఒకనాడు లిఖితుడు ధర్మ చర్చలకై అన్నగారి ఆశ్రమానికి వచ్చాడు. ఆ సమయంలో వారు ఆశ్రమంలో లేరు. వారికై వేచి వున్న సమయంలో కొంత ఆకలి అనిపించి, అక్కడే వున్న అనేక ఫలవృక్షాలలో చక్కగా పండిన మామిడి పండ్ల వృక్షం నుంచి రెండు పండ్లు కోసుకుని తింటూ ఉండగా, శంఖుడు రావడం జరిగింది. కుశల ప్రశ్నల అనంతరం అన్నగారు 'నాయనా! నువ్వు తిన్న పండ్లు ఎక్కడివి?' అని అడిగాడు. లిఖితుడు 'అన్నయ్యా! నేను వచ్చి చాలాసేపు అయింది. ఆకలి వేయడం వలన ఇక్కడి చెట్ల ఫలాలు కోసుకుని తిన్నాను' అన్నాడు.

అప్పుడు అన్నగారైన శంఖుడు 'ధర్మమే ప్రధానంగా జీవించే మన జీవన విధానంలో పూర్వవిధి నీచేత ఇలా అధర్మం చేయించింది. ఇది అధర్మం కదా నాయనా! నా ఆశ్రమంలో వున్న వృక్ష ఫలాలను తీసుకునే ముందు యజమానినైన నా అనుమతి తీసుకోవాలి కదా! నాకు చెప్పకుండా ఆ పళ్ళు తినడం వలన నీకు అధర్మ దోషం కలిగింది. ఇది నాకు చాలా బాధను కలిగించింది' అనగానే లిఖితుడు తన పొరపాటు గ్రహించి, మన్నించమని అన్నగారిని క్షమాపణ వేడుకున్నాడు. అప్పుడు శంఖుడు 'నాయనా! నీవు చేసిన పనివలన నాకు జరిగిన నష్టం కంటే, నీకు కలిగిన అధర్మదోషం గురించే నాకు బాధ' అన్నాడు.

లిఖితుడు మట్లాడుతూ, 'అన్నయ్యా! నాయీ అధర్మదోషం పోయేలాగా నువ్వు నాకు ఏదైనా శిక్ష విధించు' అని ప్రాధేయపడ్డాడు. అప్పుడు శంఖుడు 'సోదరుడా! నిన్ను శిక్షించి, పరిశుద్ధుడిని చేసే అధికారం నాకు లేదు. నువ్వు ఈ దేశాన్ని పాలించే సుద్యుమ్న మహారాజు దగ్గరకు వెళ్ళి, తగిన దండన తీసుకో! ఆయన విధించిన శిక్షను అనుభవించడం ద్వారానే నీ పాపం పోతుంది' అని చెబుతాడు. లిఖితుడు వెంటనే రాజుగారి దగ్గరకు వెళ్ళి, జరిగిన విషయమంతా తెలియజేసి, తనకు తగిన శిక్ష విధించమని ప్రాధేయపడతాడు.

రాజగారు అటువంటి ఉత్తముడైన లిఖితమహర్షిని శిక్షించడం తనవల్ల కాదని చెప్పగా, తప్పుచేసిన దోషిని శిక్షించకపోతే, నీవు రాజ ధర్మాన్ని తప్పినవాడవవుతావు, దాని వలన నీకు దోషం వస్తుందని లిఖితుడు రాజును హెచ్చరిస్తాడు. అప్పుడు రాజు తత్వవేత్త, ధర్మమూర్తి అయిన లిఖిత మహర్షితో 'నా రాజ్యంలో దొంగతనం చేసిన వానికి చేతులు నరికే శిక్షగా శాసనం వున్నది, కాని నేను తమరికి అలా చేయలేను' అన్నాడు. అప్పుడు లిఖితుడు శాసనం ప్రకారం

చేయవలసినదే అని చెప్పగా, లిఖితుని రెండు చేతులూ నరకబడ్డాయి. తాను చేసిన అధర్మానికి అతడు అలా కోరుకుని మరీ శిక్షను పొందాడు.

లిఖితుడు సంతోషంతో నరకబడిన మొండి చేతులతో తిరిగి అన్నగారి దగ్గరకు వెళ్ళి, శిక్షను పొందాను కనుక తనను పాప విముక్తుడిని చేయమని కోరాడు. శంఖుడు ఆనందంతో తమ్ముడిని కౌగలించుకుని, 'నాయనా! నువ్వు పరిశుద్ధుడవు అయ్యావు. పంచ మహాపాతకాలలో పరులసొమ్ము తీయడం అనే దొంగతనం ఒకటి. బ్రహ్మజ్ఞాని, పూజ్యుడు అయిన అన్నగారి ఆశ్రమంలో పండు దొంగిలించడ మనేది, విధి నీ చేత చేయించింది. నీవు కోరి తెచ్చుకున్న ఈ శిక్షవలన నీ కీర్తి అన్ని లోకాలలోనూ వ్యాపిస్తుంది. పూజ్యుడవు, వంశోద్ధారకుడవుగా, ధర్మ పరిపాలన చేసిన నీ కీర్తి అందరికీ ఆదర్శప్రాయమవుతుంది' అన్నాడు. ఇంతలో సాయం సంధ్యా సమయం అయింది. అర్ఘ్యాలు ఇచ్చే సమయం అయింది. కాని తర్పణాలు ఇవ్వడానికి తనకి చేతులు లేవనే భావనతో నదిలో మునిగి లేచేసరికి లిఖితునికి యధాప్రకారం చేతులు తిరిగి వచ్చాయి. స్వప్రయోజనం కోసం కాక, అర్ఘ్య ప్రదానం అనే ధర్మాన్ని గురించి తలచినందు వలననే అతనికి తిరిగి చేతులు వచ్చాయి. చేసిన పాపం పోయి యధాపూర్వం అయ్యాడు. ఇలా బాహువులు ప్రసాదించింది కనుక ఆ నదికి బాహుదా నది అని పేరు వచ్చింది. మన మహర్షులు వారి బోధల ద్వారా, వారి జీవన విధానం ద్వారా మనకు అనేక ధర్మాలు బోధించారు. వారి సంతానమైన మనం వాటిని ఆచరించి, బాగుపడాలని మాత్రమే కాక, వారి సంతానం వలన లోకహితం జరగాలని వారి ఆకాంక్ష!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***మే 2025 :*** AS 8044, 8535, 8536

***జూన్ 2025 :*** AS 8540, 8541, 9045, PK 0097

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

## ప్రథమోధ్యాయము - అర్జున విషాదయోగము

ఆసక్తి ఇంకా అర్జునుడితో ఏమి పలికిస్తున్నదో చూడు. అర్జునుడు ఇంకా అంతటితో ఆగక "శ్రీకృష్ణా! ధార్తరాష్ట్రులను చంపటం మనకు మంచిది కాదు. అది తగిన పని కాదు. అది కులనాశనము, మిత్ర ద్రోహము అవుతుంది. అవి ప్రాయశ్చిత్తం లేని మహాపాపాలు. తెలిసి తెలిసి మనం అటువంటి పాపాచరణం ఎలా చేయగలము? దుర్యోధనాదులు అంటావా, అసూయ, ద్వేషం, క్రోధం, మాత్సర్యం మొదలైన వాటితో వారి మనస్సులు కలుషితం అయ్యాయి. అందువలన వారు గుణ దోషములను గాని, యుక్తాయుక్తము లను కాని, మంచి చెడ్డలను కాని



తెలుసుకోలేకపోతున్నారు. కాని మనం వారికన్నా వివేకులం కదా. దురాశాపూరితులైన ధార్తరాష్ట్రులు, లోభము చేత బుద్ధిహీనులై, కులక్షయం వలన కలిగే అనర్థాలను గాని, మిత్రద్రోహం వలన సంక్రమించే పాపాన్ని గాని తెలుసుకోలేక పోతున్నారు. కాని ఇది పాపం అని తెలిసిన మనం అయినా ఆ పాపాన్ని చేయకుండా ఉండటానికి ప్రయత్నించవద్దా?

కులక్షయం వల్ల సనాతనంగా వస్తున్న కులధర్మం నశిస్తుంది. ధర్మం నశించిన వెనుక మిగిలేది ఏముంటుంది? వంశమంతా కలుషితమైపోతుంది. అధర్మం పెచ్చు పెరిగి కులస్త్రీల శీలం చెడుతుంది. కులస్త్రీలు చెడితే వర్ణ సాంకర్యం ఏర్పడుతుంది. వర్ణ సాంకర్యం వలన కులానికి, కులఘాతకులకు నరకం తప్పదు. ఇక వారి పితృదేవతలు, పిండోదకాలు లేనివారై పతనం చెందుతారు. ఈ విధంగా కులఘాతకుల దోషముల వలన, వారి పాపభూయిష్టమైన చర్యల మూలంగా సనాతన ధర్మము, సంప్రదాయము మంట గలుస్తాయి. ధర్మ హాని వలన శాశ్వతంగా నరకానికి పోవలసి వస్తుంది.

ఆహా! అల్పమైన రాజ్య సుఖాలపై లోభం చేత మనం స్వజనాన్ని చంపటానికి కూడ సిద్ధపడ్డాము. ఇది ఎంత ఘోరం? నాకు ఈ ప్రతీకారం వద్దు. నేను ఇప్పుడే శస్త్రాస్త్రములను సన్యసిస్తాను. వారే అన్ని శస్త్రములు ధరించి వచ్చి నన్ను చంపినా మంచిదే. మనం తలపెట్టిన ఘోరమైన ఈ పాపకృత్యం కన్న నాకు అదే క్షేమం" అని శ్రీకృష్ణ భగవానుడి ముందే నీతులు వల్లిస్తూ, విల్లు, అమ్ములను విడిచి, దుఃఖావేశంతో రథంలో చతికిలపడ్డాడు.

అప్పటిదాకా యుద్ధం చేయటానికి సర్వసన్నద్ధుడై వచ్చి, ధనుస్సునే కాక శరమును కూడ చేతపట్టిన అర్జునుడు ఇప్పుడు ఒక్కసారిగా నేను యుద్ధం చేయలేను అని చతికిలపడ్డాడు. అటువంటి స్థితిలో ఉన్న అర్జునుడు, శ్రీకృష్ణ భగవానుడు అందించిన గీతోపదేశం అనే అమృతాన్ని గ్రోలి, అన్ని సందేహాలు నశించగా, కర్తవ్యపాలనకు నడుం కట్టి నిలబడ్డాడు. దీనిని బట్టి భగవద్గీతలోని బోధామృతానికి ఎంతటి విశిష్టత ఉన్నదో తెలుసుకో. అలాగే గీతోపదేశం ఏ సందర్భంలో చేయబడిందో గ్రహించి, నీ జీవితంలో నీకు ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని వాటితో పోలిస్తే గీతోపదేశం జరిగిన సన్నివేశ సందర్భాలకు ఎంత విశిష్టత, ప్రాముఖ్యత, ప్రాశస్త్యం ఉన్నాయో తెలుసుకో.

ఆసక్తి నిద్రాణంగా నీలో ఎప్పుడూ ఉన్నది. అది బహిర్గతమైనప్పుడు నిన్ను, నీస్వధర్మాన్ని చక్కగా నిర్వర్తించనీయదు. దాని వలన నీ సాధ్యము దెబ్బతింటుంది. దానికి ఏదైనా ఆటంకంగాని, అఘాతంగాని కలిగినప్పుడు అది శోకంగా మారుతుంది. అలాకాక అది సఫలమైతే సంతోషముగా మారుతుంది. శోకముగా మారినా సరే, సంతోషంగా మారినా సరే, అది నీలోని సాధకుణ్ణి సరైన మార్గం నుండి తప్పించి తప్పుదారి పట్టించటమే కాకుండా నీ లక్ష్యాన్ని కూడా చెడగొడుతుంది.

ఆధ్యాత్మిక చింతన అనేదే లేని బద్ధుడిలో గాని, ఆత్మానుభూతిని అందుకున్న బుద్ధుడిలో గాని ఇటువంటి సంఘర్షణ కలగనే కలగదు. నీవంటి సాధకుల మనస్సులలోనే, ప్రత్యేకంగా ఇటువంటి ఘర్షణ తరచూ కలుగుతూ ఉంటుంది. కొంచెం సూక్ష్మంగా పరిశీలిస్తే, అర్జునుడు కూడ, తనలోని ఘర్షణ, హింస, అహింసలకు మధ్య ఘర్షణ అనిగాని, యుద్ధ కౌశలానికి, తంత్రానికి సంబంధించిన సమస్య అని గాని

అనలేదు అని తెలుస్తుంది. ఒకవేళ అర్జునుడికి కలిగిన సందేహము అటువంటిదే అయి ఉంటే, అర్జునుడు మొదటనే "శ్రీకృష్ణా! ఇదేమిటి? ఆత్మ అని, జగత్తు అని, ఏమేమో చెపుతున్నావు. వాటిని ప్రక్కనపెట్టి, ప్రస్తుతం యుద్ధరంగంలో నేను చేయవలసింది ఏమిటో చెప్పు" అని అడిగి వుండేవాడు. ఆ మాటకు వస్తే, అర్జునుడు అసలు గాండీవాన్ని జారవిడిచేవాడే కాదు. ఒకవేళ హింస, అహింసలకు మధ్య ఘర్షణ అని అర్జునుడు భావించి ఉంటే, అతడు అసలు మొదట ధనుర్బాణములను ధరించేవాడే కాదు. స్పష్టంగా, ఇది అర్జునుడి ఆధ్యాత్మిక దృష్టిలోపం వల్ల అతడిలోని భగవదాకాంక్షకు సంసారాసక్తికి మధ్య చెలరేగిన సంఘర్షణమే కాని, వేరు కాదు.

సంజయుడు కూడ ధృతరాష్ట్రుడికి, కురుక్షేత్రంలో జరుగుతున్న దానిని వర్ణిస్తూ "అత్యంత విషాదంతో అర్జునుడి కళ్ళు, కన్నీళ్ళతో నిండిపోయాయి, అర్జునుడు పరాకృపతో నిండి ఒక విషాద మూర్తిలా ఉన్నాడు" అని చెప్పాడు. అర్జునుడంతటివాడు అలా అయినాడు అంటే, ఆ శోకము ఎంత బలవత్తరమైనదో, దానికి మూలమైన ఆసక్తి మరింకెంత భయంకరమైనదో నీవే ఆలోచించు.

- సశేషం

**కంటికి కానరానంత మాత్రాన దేవుడు లేడనుకోవడం అజ్ఞానం. అవివేకం. అగోచరుడైన ఆ సర్వశక్తి సంపన్నుని సాధనతో ప్రసన్నం చేసుకోవచ్చు. ఈ జన్మలోనే భగవత్ సాక్షాత్కారాన్ని పొందవచ్చు. దానికోసం సన్యాసం తీసుకోనవసరం లేదు. ముక్కు మూసుకుని తపస్సు చేయనక్కర్లేదు. ఆసేతు హిమాచల పర్యంతం తీర్థయాత్ర చేయనక్కర్లేదు. హుండీలో నోట్ల కట్టలు కుమ్మరించనక్కర్లేదు.**

**దైనందిక కృత్యాలు నిర్వహిస్తూ, ధర్మమార్గాన నడుస్తూ, దృష్టిని మాత్రం భగవంతునిపై వుంచాలి. సాధన వుంటే సాధ్యం కానిదేదీలేదు.**

- శ్రీ బాబూజీ మహరాజ్

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహారాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి)

-పాలూరి ప్రసాద్

**11. ఓం శుభాకారాయ నమః**

చరాచర జగత్తు అంతానిండి నిరాకారులైవున్న శ్రీగురుదేవులు జగదోద్ధారణే ధ్యేయంగా, సాకారులై నిర్హేతుక కరుణా కటాక్షములను వర్షింపజేయుటకు అవతరించినందున వారి రూపము మంగళప్రదము. వారి దివ్య మంగళ విగ్రహ దర్శనమాత్రముననే సర్వ శుభములు చేకూరును.

**12. ఓం సర్వ ధర్మ ప్రచారకాయ నమః**

విశ్వమత విధాత అగుటచే సర్వ ధర్మములు శ్రీగురుదేవుని ఆశ్రయించుకొని ఉన్నవి. వారికి స్వధర్మమేమియును లేకున్నను పామరజనోద్ధరణకై వారు అన్ని ధర్మములను ప్రచారము చేయుదురు. వారు తమ శిష్యుల ఆధ్యాత్మిక స్థితిని బట్టి వారికి తగు ధర్మము నుపదేశించెదరు. ఎవరికి ఆదేశించిన ధర్మమును వారే అనుష్ఠింపవలయును.

**13. ఓం సర్వజ్ఞాయ నమః**

శ్రీగురుదేవులు సర్వజ్ఞులు - అనగా అన్నియు తెలిసిన వారు. దేనిని తెలుసుకొంటే ఇక తెలుసుకొనవలసిన అవసరము ఉండదో అట్టి జ్ఞాన స్వరూపులు. అన్ని విద్యలు వారినే ఆశ్రయించుకొని వర్ధిల్లుచున్నవి. నిజమైన శిష్యుడు అట్టి గురుదేవుల వద్ద మనసు దాచరాదు.

**14. ఓం సర్వ సంపన్నాయ నమః**

శ్రీ గురుదేవుల సంపద అపారమైనది. సర్వ సంపదలకు అధిష్టానమైన ఆధ్యాత్మిక సంపదకు వారు అధిపతి. అంత సంపన్నులైనను వారిలో లోభము ఇసుమంతైనను లేదు. తమను ఆశ్రయించిన శిష్యులందరినీ మహోన్నతమైన తమ ఆధ్యాత్మిక సంపదకు వారసులను చేయుటయే వారి యొక్క ఆశయము.

**15. ఓం సర్వాభీష్టఫలప్రదాయ నమః**

తమను ఆశ్రయించిన వారి సర్వ సదభీష్టములను ఫలింపచేసెడి దాత శ్రీగురుదేవులు. ధర్మబద్ధమైన ఎట్టి కోరికలైనను వారిని కోరిన తక్షణమే నెరవేరుతాయి. కాని ఇక్కడ ఒక కిటుకు ఉన్నది. వారు అడిగిన వారికి అడిగినవన్నీ ఇస్తారు. కానీ ఏమీ అడగక సంపూర్ణ శరణాగతి పొందిన వారికి తమను తామే అర్పించుకొని వారి కొంగు బంగారమై నిలుస్తారు.

**16. ఓం పరమాయ నమః**

ఈ ఇహలోక, పరలోకములు రెంటికీ అతీతమైన పరమపద ప్రదాత అయిన పరబ్రహ్మ స్వరూపులే శ్రీ గురుదేవులు.

**17. ఓం పరమోదారాయ నమః**

శ్రీగురుదేవులు పరమ ఉదార స్వరూపులు. వారి దాతృత్వానికి అంతు లేదు. నమ్మిన వారికి బంగారు పిచ్చుక. నమ్మని వారికి బూడిదే. తమను నమ్మి శరణు పొందిన వారికి వారు తమను తాము అర్పించుకుంటారు.

**18. ఓం భావనాతీత వర్తనాయ నమః**

శ్రీ గురుదేవులు మన భావనలకు అతీతమైన ప్రవర్తన కలవారు. వారిని అంచనా వేయటం వారికే సాధ్యం. కాని వారు పరమ దయాళువులై మన భావనకు తగ్గరూపంలోనే మనను అనుగ్రహిస్తారు. సర్వభావములను విడిచి పెట్టిన నాడు మన హృదయ బాబుగా ప్రకాశిస్తారు.

**19. ఓం విమలాయనమః**

వెలుగు ప్రసరించిన క్షణములోనే ఆ పరిసరములలో చీకటి నశించిపోయినట్లు శ్రీగురుదేవులున్న పరిసరములలో మాలిన్యమునకు తావులేదు. అందువలన వారు సదా పరిశుద్ధులు. అగ్ని తనలో వేసిన మలినములను సైతము పవిత్ర విభూతిగా మార్చివేసినట్లు శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన భక్తుల హృదయాలలోని మలినాలను తొలగించి పరిశుద్ధముగా చేసి తమ నివాసముగా మార్చుకొనగల సమర్థులు.

**20. ఓం వేద వేదాంగ కోవిదాయ నమః**

శ్రీ గురుదేవులు ఆత్మజ్ఞాన నిధి. ఆధ్యాత్మిక విద్యకు అధిపతి అగుటచే సర్వ వేద వేదాంగములు వారిని ఆశ్రయించుకొని ఉన్నవి. ఎంతటి పండితులనైనను వాదనలో ఓడించి తమ శిష్యులుగా చేసికొనగల వారి ప్రతిభను మనము దర్శించియే యున్నాము. ఒకానొకప్పుడు వేదాంత చర్చలో కొందరు వేదపండితులు అహంకారముతో "ఖండత్వము నుండి అఖండత్వము వచ్చిందా? లేక అఖండత్వమునుండి ఖండత్వం వచ్చిందా?" అని ప్రశ్నించినప్పుడు శ్రీగురుదేవులు 'తమరు ఖండత్వంలో ఉండి ఈ ప్రశ్న వేశారా? లేక అఖండత్వంలో ఉండి వేశారా?' అని తిరుగు ప్రశ్న వేయగా వారు యిరకాటంలో పడి ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వటానికి ప్రయత్నిస్తే తమ అజ్ఞానం బయటపడుతుందని గ్రహించి వేదమూర్తియైన స్వామికి తల వంచినారు.

- సశేషం

# హనుమజ్జయంతి

- కీ.శే. రమణ ప్రసాద్

అనన్యమైన భక్తికి, అనంత శక్తికి, అతులిత పరాక్రమానికి ప్రతీకగా హనుమంతుని ప్రజలు ఎంతో భక్తితో కొలుస్తారు. హనుమజ్జయంతి నాడు ఉదయాననే హనుమదాలయాలకు వెళ్ళి, సిందూరం హనుమంతునికి సమర్పిస్తారు. శాంతి, సౌభాగ్యాల కోసం, భూత ప్రేత పిశాచాల బారినుండి రక్షణకోసం శ్రీ తులసీదాసు విరచితమైన "హనుమాన్ చాలీసా" పారాయణ చేస్తారు.

హనుమంతుని అకుంఠిత భక్తిని చాటే కొన్ని గాధల గురించి తెలుసుకుందాం: రావణ వధానంతరం శ్రీసీతారాములు అయోధ్యా ప్రవేశం చేశారు. శ్రీరామ పట్టాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీరాముడు విలువైన కానుకలు ఇచ్చి అందరినీ సత్కరిస్తున్నాడు. కానీ హనుమకు ఏమీ ఇవ్వలేదు. ఇది గమనించిన సీత హనుమకు ఎంతో విలువైన రత్నాలహారం కానుకగా ఇచ్చింది. హనుమంతుడు దానిని బాగా పరిశీలించి, పెదవి విరిచి, ఒక్కొక్క రత్నాన్ని పంటితో కొరికి విసిరేస్తున్నాడు. ఇది చూసి సీత "ఏమిటిది హనుమా! ఎంతో విలువైన హారాన్ని నీకు ఇస్తే, హారంలోని రత్నాలను పగులకొడుతున్నావు?" అని అడిగింది. "మాతా! ఈ రత్నాలలో నా రాముడు కనిపిస్తాడేమోనని చూశాను. కానీ కనిపించలేదు" అన్నాడు. ఈ సమాధానం విన్న సభలోని వారందరూ పకపకా నవ్వి, "అయితే రాముడిని నువ్వు మాకు చూపగలవా?" అని అడిగారు. "రాముడు అంతటా నిండి ఉన్నాడు. నాలోనూ ఉన్నాడు" అని తన గుండెను చీల్చి చూపించాడు. అందులో శ్రీసీతారాములు విరాజమానమై ఉన్నారు.

ఒకనాడు సీతామాత తన పాపిటలో సిందూరం దిద్దుకోవటం హనుమంతుడు చూశాడు."మాతా! మీరు మీ నుదటను ధరించినది ఏమిటి?" అని అడిగాడు. "నేను నా స్వామి దీర్ఘాయుష్షు కోసం ఈ సిందూరాన్ని ధరిస్తున్నాను" అని సీత బదులిచ్చింది. అంతే! మరుక్షణంలో హనుమంతుడు ఒంటినిండా సిందూరం పూసుకుని సీతారాముల ముందు నిలబడ్డాడు. రాముడు ఆశ్చర్యంతో "హనుమా! ఈ రోజు మాకు ఈ లీల ఎందుకు చూపిస్తున్నావు?" అని అడిగాడు. "స్వామీ! మీ దీర్ఘాయుష్షు కొరకు సీతామాత చెప్పిన విధంగా నేను సిందూరాన్ని ధరించాను" అని అన్నాడు. రాముడు అతని భక్తికి సంతోషించి,

"హనుమా! ఈ సిందూరం నీకు భక్తితో సమర్పించేవారి కష్టాలన్నీ తొలుగుతాయి" అని వరం ఇచ్చాడు.

అయోధ్యకు వచ్చాక అనవరతం రాముని సేవించే అవకాశం లభించటం లేదు. సీత "ఏకాంత మందిరంలోకి అనుమతి లేకుండా నువ్వు లోపలకి రాకూడదు" అని అన్నది. గోరుచుట్టు మీద రోకటి పోటులాగా, రాముని అన్నదమ్ములు. సీతామాత రామునికి చేయవలసిన సేవలన్నీ పంచుకుంటున్నట్లు రాముని ఆమోదంతో ఉత్తరువులు జారీ చేశారు. హనుమ "నాకు మీరు ఏ సేవను ఇచ్చారు?" అని అడిగాడు. "నువ్వు అరణ్యంలో 14 ఏళ్ళు చాలా సేవలు చేశావు. ఇప్పుడు ఆ సేవలన్నీ మేము చేస్తాము. నువ్వు విశ్రాంతి తీసుకో" అని చెప్పారు.

హనుమంతుడు ఆ సేవల లిస్ట్ చూశాడు. రాముడు ఆవలిస్తే చిటిక వేసే సేవ ఎవ్వరికీ ఇవ్వబడలేదు. "నాకు ఈ సేవ ఇవ్వండి" అన్నాడు. వారు "సరే" అన్నారు. ఒకసారి రాముడు ఏకాంత మందిరంలో ఉన్నాడు. హనుమకు లోపలకు ప్రవేశం లేదుగా. అందుకు తాను బయట కూర్చుని "నా రాముడికి ఆవలింత వస్తే బయటనుంచి చిటిక వెయ్యలేను కదా ఈలోపు నా రామునికి ఆవలింత వస్తే ఎలా?" అని ఆపకుండా చిటిక వేస్తున్నాడు. ఆవలించిన రాముని తెరిచిన నోరు తెరిచినట్లే వుండిపోయింది. రామునికి ఏమైనదో తెలియక అందరూ కంగారు పడ్డారు. వైద్యులు పెదవి విరిచారు. అప్పుడు వసిష్ఠులవారు బయటకు వచ్చి ఆపకుండా చిటిక వేస్తున్న హనుమంతుని ఆపారు. రాముని ఆవలింతలు ఆగిపోయాయి. వెంటనే హనుమంతుడు రామునికి అన్ని సేవలూ చేయటానికి అనుమతి ఇస్తున్నట్లు ఉత్తరువులు జారీ చేయబడ్డాయి. ఇవి హనుమంతుని అనన్యభక్తికి తార్కాణాలు.

హనుమంతుడు అంజనా దేవికి వాయుదేవుని అనుగ్రహంతో జన్మించాడు. సాక్షాత్తు శివుడే రామావతారంలో విష్ణుమూర్తి అవతారమైన రామునికి సేవలు చేయటానికి హనుమంతుడిగా పుట్టాడని చెబుతారు. వైశాఖ బహుళ దశమినాడు హనుమంతుడి పుట్టినరోజు. ఆనాడు ప్రజలందరూ ఆంజనేయ స్వామిని ఊరేగిస్తారు. హనుమంతుడిని భక్తితో కొలిచి సుఖశాంతులను పొందుతారు.

# పరమహంస యోగానంద

సేకరణ - మురళీ

(గత సంచిక తరువాయి)

యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థల ద్వారా లక్షల మందికి ధ్యానం, క్రియా యోగ పద్ధతులను నేర్పించారు. వారి వుపదేశాలు కొన్ని:

ప్రతిరోజు లేచిన దగ్గరనుంచి అవి కావాలి, ఇవి కావాలి అని అనేక కోర్కెలు ప్రారంభం అవుతాయి. మీకు ఉన్నవాటిల్లో చాలా వస్తువులు, సౌకర్యాలు లేకుండా బ్రతుకుతున్నవారు వేల కోట్ల మంది ఉన్నారు. మరి అవి లేకుండా బ్రతకలేమని ఎందుకు అనుకుంటున్నారు?

ఈ హెచ్చరిక మన అందరకీ కూడా కదా! పోల్చుకోండి. జీవితం అనుభవించటమంటే అంతులేని కోర్కెలు తీర్చుకోవటం కాదు. తినటం కోసం బ్రతకకండి, బ్రతకటం కోసం తినండి. అంతులేని కోర్కెలకు కళ్ళెం వెయ్యండి. ఇంద్రియ ఆకర్షణలకు బందీలై పోకండి. లేకపోతే మీ దైనందిన చర్యలతోనే జీవితం ముగిసిపోతుంది.

ఆ పనుల మధ్యలోనే ఏదో ఒకరోజు జీవితం సాధించ వలసినది సాధించకుండానే అంతమైపోతుంది. జీవితపు చివరి క్షణంలో మేల్కొన్నా ఉపయోగం ఉండదు. సాధారణ దినచర్యతో మీరు గడిపే జీవితమంతా ఒక స్వప్నం మాత్రమే. మేల్కొన్న తరువాత రోజూ విధముగా గడిపే దినచర్యే. మరణం, పునర్జన్మ ఇంతేనా? మీ నిజమైన ఏకైక అవసరం భగవంతుడొక్కడే. అది గుర్తించి అయనతో తాదాత్మ్యం చెందితే ఈ స్వప్నభూమికి తిరిగి రావలసిన అవసరం ఉండదు. మరణభయం వుండదు, మరణబాధ ఉండదు. భగవంతుడు మీ ప్రార్ధన వింటున్నాడనే సంపూర్ణ విశ్వాసంతో, అన్య భావన లేకుండా లీనమై ప్రార్ధన చెయ్యండి. మీకు తప్పక భగవదనుభూతి కలుగుతుంది. దర్శనం అవుతుంది.

విశ్వాసం ప్రగాఢమైనప్పుడు అనుభవం కలుగుతుంది. విశ్వాసం వేరు, అనుభవం వేరు. మీరు విన్నదాన్ని లేదా చదివినదాన్ని యదార్ధమని అంగీకరించినప్పుడు విశ్వాసం కలుగుతుంది. గాఢమైన విశ్వాసం కలగాలంటే నిశ్చలమైన సంకల్పం ఉండాలి. కొంతమంది (ప్రత్యేకముగా సోమరులు) ఏదైనా పని మొదలు పెట్టకముందే 'ఈ పని చాలా కష్టం, నేను చేయలేను' అనే ధోరణితో పని అసలు మొదలు పెట్టనే పెట్టరు.

ఏపనైనా మనము చెయ్యగలము అనే నిశ్చలమైన సంకల్పముతో చేస్తే తప్పక దైవబలం చేకూరుతుంది. ప్రగాఢమైన విశ్వాసాన్ని, భక్తిని అనుభవంలోకి తెచ్చుకోవాలంటే మీ సంకల్పం నిశ్చలంగా ఉండాలి. సంకల్ప శక్తి ఉన్నవారితో మీ సహచర్యం ఉండాలి. నిశ్చలమైన సంకల్పముతో, నిశ్చలమైన మనస్సుతో, విశ్వాస బలముతో సాధన చేస్తే పొందలేనిదేమీ ఉండదు.

భగవంతుడి పట్ల మీకున్న భక్తి, ఆయన్ని గురించిన జ్ఞానం సంపూర్ణం అయ్యేవరకు విశ్రమించకండి. ధ్యానం కొరకు కొంత నిర్దేశిత సమయాన్ని కేటాయించండి. ఆ సమయంలో నిద్రకు కాని, మరి ఏ ఇతర విషయానికి కాని తావివ్వకండి. భగవద్విషయానికి మించి మరి ఏ విషయానికి ప్రాముఖ్యత యివ్వకండి. ప్రేమలన్నింటిలోకి భగవంతుడి ప్రేమే అత్యుత్తమమైనది. భగవంతుడిని నిర్లక్ష్యం చేస్తూ యితర విషయాలకు ప్రాముఖ్యత ఇస్తున్నంతకాలం మీ బాధలు పెరుగుతాయే కాని తగ్గవు. ఆలశ్యం చేయకండి. భగవంతుడితో అనుసంధానం పొందటానికి చేసే ప్రయత్నం మన:పూర్వకముగా, నిశ్చయముగా వుండాలి. భగవంతుడిని మీ కళ్లతో మీరు చూసేవరకు, మీ హృదయంలో ఆ అనుభూతి పొందే వరకు పట్టు విడవకండి, విశ్రాంతికి చోటివ్వకండి. జీవితం అంటే బాల్యం, యవ్వనంలో వివాహం, పిల్లలు, ముసలితనం ఇంతేనా జీవితం? అసలైన జీవితం ఇంకా లోతైనది, అద్భుతమైనది కూడా !! భగవంతుని పొందటమే అసలైన జీవితం. అది పొందిన వారికి ఇక విచారమే లేదు, అంతా ఆనందమే! శ్రీ పరమహంస యోగానంద 1952 మార్చి 7వ తేదీన లాస్ ఏంజిలిస్ (అమెరికా) లో మహాసమాధి చెందారు.



# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

రెండవ అధ్యాయములో చివరివైన 31, 32 మరియు 33 సూత్రములు ముందు చెప్పబడిన **"స్వయం ఫల రూపతేతి"** అన్న అంశమును విశదీకరిస్తూ పరాభక్తి కేవలం అనుభవైక వేద్యమనీ ఇతరమైన పద్ధతులతో తెలియబడదనీ వివరిస్తున్నాయి.



**భక్తి సూత్రము 31: రాజ గృహ భోజనాదిషు తథైవ దృష్టత్వాత్**

**తాత్పర్యము:** పరాభక్తి అనునది స్వయం ఫలరూప మనుటకు రాజు, గృహము, భోజనము మొదలైనవి దృష్టాంతములు.

ఈ సూత్రమును వివరించడానికి మూడు దృష్టాంతములు చెప్పబడుతాయి. ఒకానొక రాజునకు ఒక పుత్రుడు ఉండేవాడు. ఒకనాడు దొంగలు ఆ రాజకుమారుడిని ఎత్తుకొని పోయి ఒక సన్యాసి ఆశ్రమంలో విడిచిపెట్టగా ఆ బాలుడు సన్యాసి ఆశ్రమంలో పెరగ సాగాడు. ఆ బాలుడు తాను రాజపుత్రుడనని తెలియక సన్యాసినే అన్న భావముతో వుండేవాడు. ఒకనాడు ఆశ్రమమునకు వచ్చిన రాజభటులు జరిగిన విషయమును తెలుసుకొని అతడు రాజపుత్రుడే అని నిర్ధారించుకుని ఆ సంగతిని ఆ బాలకుడికి విశదీకరించారు. అంతట ఆ బాలకుడికి సన్యాసి భావము పోయి రాజపుత్ర భావము స్థిరమయినది. ఆ బాలుడు కొత్తగా రాజ కుమారునిగా మారలేదు. స్వస్వరూప జ్ఞానమును పొంది తాను రాజ కుమారుడినే అన్న భావనకు ఉన్న అడ్డంకులను తొలగించుకున్నాడు.

ఒక గృహస్తు తన స్వగృహమును వదిలి దేశాంతరమునకై వెళ్ళి ఎన్నో సంవత్సరాలు గడిపిన తర్వాత తిరిగి తన స్వగృహమునకు చేరాడు. అతడు దేశాంతర గతుడైనప్పుడు అతని ఇంటిలో ఏమాత్రం మార్పు రాలేదు. కానీ ఆ ఇంటిలో నివసిస్తున్న ఆ అనుభవానికి ఆ గృహస్తు దూరమయ్యాడు. తిరిగి తన స్వగృహమును చేరిన వెనువెంటనే అతని స్మృతికి దూరమైన పూర్వానుభవము అతడికి చేరువయింది. ఆ గృహము తనకు చెందినదే అన్న జ్ఞానము తిరిగి కలిగినదే తప్ప ఆ గృహములో

ఏమాత్రం మార్పు లేదు. అదేవిధంగా ఆకలితో ఉన్నవాడు భోజనము చేసినప్పుడు అంతవరకు ఉన్న క్షుద్బాధ తొలుగుతున్నది తప్ప మరి ఏ రకమైన మార్పు కలగడం లేదు. తృప్తి సహజము. ఆకలి బాధ ఆ సహజమైన తృప్తిని అడ్డుకుంటుంది. భోజనం చేసినప్పుడు సహజంగా ఉన్న తృప్తికి అడ్డువచ్చిన ఆకలి బాధ తొలగడమే జరుగుతున్నది తప్ప మరొక మార్పు లేదు.

ఈ మూడు దృష్టాంతములూ సాధన సంపత్తులన్నీ ఆగంతకముగా వచ్చిన నిరోధములను తొలగిస్తాయి తప్ప అంతకు ముందు లేని దానిని తెచ్చి పెట్టడం లేదని తెలియ చేస్తున్నాయి. పరాభక్తి ఒక్కటే ఆత్మకు నైజమైన స్వభావమని ఆ పరమానందానుభూతిని పొందడమే స్వస్వరూపానుసంధానమని ఈ సూత్రము ద్వారా నారదులు బోధిస్తున్నారు.

**భక్తి సూత్రము 32: న తేన రాజా, పరితోషః క్షుత్ శాంతిర్వా.**

తాత్పర్యము: అది తెలుసుకున్నంత మాత్రము చేత రాజు అవడం గాని, సంతోషము కలగడం గాని ఆకలి బాధ తీరడం గాని జరగదు.

ముందు సూత్రంలో చెప్పిన దృష్టాంతముల కొనసాగింపుగా ఈ సూత్రములో నారదుల వారు పూర్వజ్ఞానము పొందడమే జరుగుతున్నదని, అంతే తప్ప ఏదీ మార్పు జరగడం లేదని మరొకసారి వివరిస్తున్నారు. ముందు సూత్రంలో తెలుపబడినట్లు సన్యాసి ఆశ్రమంలో ఉన్న బాలకుడు కొత్తగా రాజకుమారునిగా మారడము గానీ, దేశాంతరము నుండి వచ్చిన గృహస్తుకి కొత్తగా గృహప్రాప్తి కలగడం గాని అదే విధముగా ఆకలి బాధ తీరడం గానీ లేవని తెలియజేస్తున్నారు. అంతేకాక ఈ సూత్రము ద్వారా పరాభక్తి కేవలం వాచకమైనది కాక అనుభవము ద్వారానే గ్రహింపగలిగినదని నారదులు మరోమారు వివరిస్తున్నారు.

**భక్తి సూత్రము 33: తస్మాత్ స ఏవ గ్రాహ్యా ముముక్షుభిః**

తాత్పర్యము: కావున ముముక్షువులు పరా భక్తినే గ్రహించవలెను. పరాభక్తి పరిపూర్ణ ఆత్మానుభూతికి సంబంధించినదనీ అదే మోక్షమన బడుతుందనీ నారదులు ఈ సూత్రము ద్వారా తెలియజేస్తున్నారు. శంకరులు వివేక చూడామణిలో **"మోక్షసాధన సామాగ్ర్యాం భక్తీరేవ గరీయసీ"**

అని వివరించిన పరాభక్తి నిర్వచనముతో ఈ సూత్రము అనుసంధానం అవుతుంది. చైతన్య మహాప్రభువు శిక్షాష్టకములో **"మమ జన్మని జన్మని ఈశ్వరే భవతాత్ భక్తిః అహేతుకీ త్వయి"** అని వివరించినట్లు జన్మజన్మలకు నీమీద చెక్కుచెదరని అహేతుకమైన భక్తిని ప్రసాదించమన్న ప్రార్థన వలే ప్రతి సాధకుడికి ఈ పరాభక్తి ఒక్కటే ప్రాప్యమనీ దానికి భిన్నమైన మోక్షమన్నది ఏదీ ఉండదని ఈ సూత్రములోని అంతరార్థము.

నారద భక్తి స్తోత్రములలోని మొదటి రెండు అధ్యాయములలో వివరింపబడిన ఈ 33 సూత్రములలో నారద మహర్షి పరాభక్తి యొక్క నిర్వచనమును, మహత్తును, విశిష్టతను వివరించారు. మొదటి రెండు అధ్యాయములతో కూడిన ప్రథమ ఖండము ఈ సూత్రముతో పూర్తి అవుతుంది. ద్వితీయ ఖండములో పరాభక్తి యొక్క సాధనములను నారదుల వారు వివరిస్తారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు, సమర్థ సద్గురు పత్రిక ప్రచురణకర్త శ్రీ చల్లా వెంకట రమణ బాబు గారు 5-4-25 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

### *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**మే 2025**

12 సోమ - వైశాఖ(గురు)పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ,

22 గురు - శ్రీగురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ,

**మే 2025**

1 బుధ: జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

20 శుక్ర: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**మే 2025**

2 శుక్ర - శ్రీ శంకరజయంతి, శ్రీ రామానుజ జయంతి, శ్రీబాబు బృందావన మూర్తి ప్రతిష్ఠ 29వ వార్షికోత్సవము - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

12 సోమ - వైశాఖ(గురు)పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

15 గురు - వైశాఖ బహుళ తదియ, ఆశ్రమ స్థాపిత 53వ వార్షికోత్సవం - శ్రీ సద్గురు పాదపూజ

17 శని - వైశాఖ బహుళ పంచమి, శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారల ప్రతిష్ఠా వార్షికోత్సవము - రాత్రి 7.00 గం.లకు సామూహిక లీలా కళ్యాణ మహోత్సవము

22 గురు - శ్రీగురుదశమి, హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

25 ఆది - మాసశివరాత్రి

27 మంగళ - అమావాస్య

28 బుధ - జ్యేష్ఠ శుద్ధ విదియ, పావులూరు శాఖ వార్షిక సత్సంగ సమావేశములు, శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి ఆరాధన - హారతి

31 శని - ఆశ్రమ వ్యవస్థాపక దినోత్సవ 53వ వార్షికోత్సవం(తేదీ) - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

**జూన్ 2025**

4 బుధ: జ్యేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణ ప్రసాద మాతాజీవారి అష్టాదశ వార్షికారాధన. సత్సంగం.

11 బుధ: జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

20 శుక్ర: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

23 సోమ: మాసశివరాత్రి

25 బుధ: అమావాస్య

# ఉలకడు-పలకడు

- పెనుమాక నాగేశ్వర రావు

ఉలకడు-పలకడు వాడే దేవుడు అన్నాడొకడు. నిజమే ననిపించింది. ఉలకటం, ఉరకటం మనుషుల నైజం. ఆయనకేం స్థితప్రజ్ఞుడు. ఉడుత నుంచి, ఉద్ధవుడి దాకా ఎందరినో తరింపచేసిన మహానుభావుడు ఆయన. సర్వం తెలిసినవాడికి ఉలకవలసిన పనేం ఉంటుంది?

ఇక పలకటం అంటే మౌనంగా సంభాషిస్తాడని చెబుతారు అనుభవజ్ఞులు. మనం నిరంతరం ఆయన నామాన్ని పలుకుతుంటే, ఆయన మనల్ని పలుకరిస్తూనే ఉంటాడు. ఆయనే మనల్ని పలుకరించక పోతే, పట్టించుకోకపోతే, మనం ఇలా ఉండగలమా?

అందుకేగా **వై ఫియర్ అయాం హియర్** అని అభయం ఇచ్చారు. అంతకు మించిన భరోసా ఏం కావాలి! ఆయన పలికిన ఆ ఒక్క పలుకు ఇచ్చే శక్తి ఎన్ని మంత్రాలు చదివితే వస్తుంది? ఎన్ని స్తోత్రాలు చదివితే వస్తుంది? అంతకు మించిన ఆత్మీయపు పలకరింత ఎక్కడ దొరుకుతుంది? ఒక పిలుపులో పిలిచితే పలుకుతావటా ఓ ఆపద మొక్కుల స్వామి నీ సన్నిధే మా పెన్నిధి అని పాడుకుంటాంగా. ఆయన పలుకు బ్రహ్మాస్త్రం.

తొణకడు, బెణకడు అన్నాడు ఇంకొకడు. అవును కదా నిండుకుండ కదా అనిపించింది. చిద్విలాసంగా నవ్వుతుంటాడు అన్నింటికీ. మనం బాధలన్నింటినీ ఏకరవు పెట్టి ఏడుస్తుంటే, ఆయన ముసిముసిగా నవ్వుకుంటుంటాడు. నిజానికి అదే మనతోటి మనుషులే అయితే మనకి రోషం, రోషంతో పాటు ఆవేశం వచ్చి మన కోపం రెట్టింపు అవుతుంది, మన ఏడుపు చూసి ఎవరైనా నవ్వుతుంటే. కానీ మనం ఎంత ఏడుపులో ఉన్నా, బాధలో ఉన్నా ఆయన నవ్వు చూస్తే పరవశం కలుగుతుంది. ఏడుపు మానేసి మనమూ నవ్వేస్తాం. బాధని మరచిపోతాం. మనసు తేలిక పడుతుంది. ఆయన్ని బ్రతిమిలాడతాం ఆయన నవ్వుకున్న సమ్మోహన శక్తి అటువంటిది. ఆ నవ్వును చూసి మనమూ ఆనందిస్తాం, పరవశిస్తాం. అమ్మ మనల్ని నవ్వుతూ చూస్తే మనకి ఎంత ఆనందం కలుగుతుందీ! మనలో ఎంతటి శక్తి, ఉత్సాహము కలుగుతుంది! ఆ నవ్వు సమ్మోహనాస్త్రం. ఇవన్నీ మన అనుభవంలోని విషయాలేగా.

కదలడు-వదలడు అన్నాడు ఇంకొకడు. అదీ వాస్తవమనే అనిపించింది. మనం మన మనసు కదిలినట్లే కదులుతుంటాం. మనోవేగం ఎక్కువనుకోండి. అది వేరే విషయం. ఒకచోట స్థిరంగా కూర్చోలేని మనం ఆయన్ని చూసి ఆశ్చర్యపోతుంటాం. నిలకడే లేని మనసా... ఎందాక నీ పయనం... అని మాతాజీ తియ్యగా పాడుతుంటే, పరవశించి పోతూనే, అయ్యో ఇవ్వాళ మా ఆవిడ కూడా ఆశ్రమానికి వచ్చివుంటే ఎంత బాగుండేది అని మనసు ఎటో వెళ్ళిపోతుంది. ఏం చేస్తుందో పిచ్చిది. ఏం చేస్తుంది వంటింట్లో వంట చేస్తుంటుంది అలా అలా వెళ్ళిపోతుంది మనసు. ఈ లోగా మాతాజీ పాట పూర్తయిపోతుంది. మనం ఆలోచించిన విషయమేమీ  తప్పు కాకపోవచ్చు. కానీ మనకి కలిగిన ఆ పరవశాన్ని కొనసాగించ లేకపోయాం కదా, కోల్పోయాం కదా.  కాబట్టే కదలకుండా స్థిరంగా కూర్చున్న స్వామిని మనం “స్థిరమగు భావననీయగదే” అని వేడుకుంటుంటాం.

ఇక వదలటం విషయానికి వస్తే...... మనం కాసేపు ఆయన్ని వదిలి వెళితే మాత్రం ఆయన మనల్ని వదులుతారా? వదిలితే మనం మనగలమా! నిజానికి ఆయన్ని పట్టుకోవటం మన తరమా? మనకి చేతనయ్యే పనేనా? ఆయన దయతలచి మనల్ని దగ్గరకు తీసుకోబట్టి ఇలా ఉన్నాం కానీ, మనంతట మనం  దగ్గర కావటం మనకి సాధ్యమా! అందుకని కదలడు-వదలడు అనే మాట కూడా సమంజసమే అనిపించింది.

చిక్కడు దొరకడు అని కూడా కొందరు నిందాస్తుతి చేస్తుంటారు. ఆయన ఎవరికి చిక్కాడు. ఒక్క భక్తికి తప్ప అన్యధా శరణం నాస్తి అన్నవారికి తప్ప ఎప్పుడూ ఎవరికీ చిక్కడు. కాసులకి లొంగే వాడు కాదాయే. కపట ప్రేమకు దొరికేవాడు కాదాయే. నిర్మల భక్తి, నిష్కల్మష ప్రేమకు మాత్రమే లొంగిపోయే లోకనాధుడు ఇంకెవరికి చిక్కుతాడు, ఎవరికి దొరుకుతాడు? కాబట్టి ఆయన చిక్కడు-దొరకడు అనటం కూడా సబబే అనిపించింది.

అందరివాడు అన్నది అసలైన మాట. సరైన పదం, సరసమైన పదం. బృందావనమది అందరిదీ, గోవిందుడు అందరివాడేలే అని కదా పాడుకుంటాం. అది నిజం. ఆయన అందరివాడు. ఇందుకు మరో విశేషం ఏమిటంటే, దేవుడు వరం ఇచ్చినా పూజారి వరం ఇవ్వడు అనే మాట లోకంలో ఉన్నది. కానీ మన అదృష్టం ఏమిటంటే మనకి దేవుడూ

ఆయనే, పూజారీ ఆయనే. (అమ్మేగా పూజలు చేయించేది) కాబట్టి వరమియ్యని పూజారులెవ్వరూ లేరు .

**ఒక సూర్యుండు సమస్త జీవులకు తా నొక్కొక్కడై** అన్న చందంగా సూర్యుడు ఒక్కడే. అయితే ఆయన దృష్టి అందరి మీదా సమంగానే వుంటుంది. మనం ఎవరికి వాళ్ళమే ఆ సూర్యభగవానుడు నా వాడే అన్నట్లు భావిస్తాం. ఇదే విషయాన్ని తానొకడైనా, తలకొకరూపై అని పాడుకొని తన్మయులం అవుతున్నాం కదా. కాబట్టి సర్వాంతర్యామి అయిన గురుదేవులు మన అందరివాడు. ఆ దివ్య చరణారవిందాలకు భక్తిగా ప్రణమిల్లుదాం!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**మే 2025**

12 సోమ - వైశాఖ(గురు)పూర్ణిమ - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

22 గురు - శ్రీగురుదశమి - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**జూన్ 2025**

11 బుధ: జ్యేష్ఠ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

20 శుక్ర: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

‘‘ఒప్పుకుంటున్నాను. కానీ, దాక్కుని ఎదుటివాడిని సంహరించుట రాజకులమునకు చెందిన వారికి ధర్మమా?” ఈ ప్రశ్నకు లక్ష్మణుడు ఇవ్విధముగ సమాధానమిచ్చాడు.

“మీ సహోదరుడు సుగ్రీవుడు మా వద్దకు వచ్చి శరణు వేడుకొనగ, అప్పుడు రాముడు నీతి, నియమములు లేని నిన్ను సంహరించెదనని మాట ఇచ్చాడు. పిదప నీవు యుద్ధమున రాముని వద్దకు వచ్చి, ‘నేను కూడ నీకు శరణు!’ అని చెప్పకముందే, తన మాట నిలుపుకొనుటకు ఆతడు చెట్టు వెనకనుండి నీపై బాణం సంధించాడు”.

వేదమందలి సూక్ష్మమును గ్రహించిన వాలి తన సోదరుని భార్యను తన వశం చేసుకున్నది తప్పేనని ఒప్పుకున్నాడు. “ఓ రామా! మేము వానరులము. తప్పుజేయుట మా స్వభావం. ఒకవేళ భవిష్యత్తులో నా సోదరుడు ఏదేని తప్పు చేసినచో ఇదే విధముగ అంబును సంధించి సంహరించవలదు. ఆతనికి, నాకుమారుడు అంగదునికి ఇకపై నీవే రక్ష” అని చెప్పి ప్రాణములు విడిచాడు వాలి.

**<u>వెదకె నాల్గుదిక్కులా!</u>**

అన్నగారి ఆనతి మేరకు లక్ష్మణుడు, సుగ్రీవుని కిష్కింధకు రాజును చేసి, అంగదుని ఆ రాజ్యమునకు యువరాజుగను పట్టాభిషేకము చేశాడు. ఆనందాతిశయముతో సుగ్రీవుడు మధువు నారగించి కామకేళిలో మునిగితేలియాడుచు, అప్పుడే ఆరంభమైన వర్షఋతువును, తదుపరి శీతాకాలమును ఆస్వాదించి సంతోషంతో కాలం వెళ్లబుచ్చాడు. రాముడు, సోదరుడు లక్ష్మణుడు ఒక గుహలో కాలం గడిపారు. సుగ్రీవునకు ఆ వర్షాకాలం హాయిగ గడచిపోతుంటే, రామునికి మాత్రం ‘ఈవర్షాకాలం త్వరగా ముగిసిపోతే బాగుండును’ అనిపించింది. సీతను ఎడబాసిన అన్నగారి మనోవేదనను గమనించిన లక్ష్మణుడు ఆతనిని అనునయించాడు.

“హనుమంతుని వంటి వానరవీరుని సహాయము చేతనే జనక పుత్రికను చెరసాల నుండి విడిపించగలము” అని అనునయముతో

చెప్పి రాముని ఆవేదనను చల్లబరచాడు. ఏదో ఒక విధంగా వర్షాకాలం ముగిసిపోయింది. వర్షాకాలమంతా గుహలో కాలం వెళ్ళబుచ్చిన రాముడు మనోవ్యాకులతతో 'సుగ్రీవుడు ఎందులకు ఇంకా సీతను విడిపించు ప్రయత్నమేమియునూ చేయుటలేదు? ఒకవేళ ఆ విషయమును మరచిపోయాడా?' అని తలచుచూ సోదరుడు లక్ష్మణుని పిలిచి, "లక్ష్మణా! వెనువెంటనే నీవు సుగ్రీవుని రాజమందిరము నకు వెళ్ళి, "వాలిని సంహరించిన అదే అంబు, కృతఘ్నత మరచిన వానిని కూడా తాక సిద్ధంగా ఉన్నదని తెలియజేయుము" అని ఆనతిచ్చాడు.

కోపాగ్నితో రగిలిపోవుచు రాజమందిరములోనికి అడుగిడిన లక్ష్మణుడికి తార ఎదురుపడి, పరిస్థితిని తాను చక్కదిద్దుతానని చెప్పి, ఆతని ఆగ్రహమును చల్లబరచింది. పిదప అంగదునితో కలసి సుగ్రీవుని అంతఃపురమునకు వెడలి ఆతని అలక్ష్యమును చాటిచూపి, బుద్ధిచెప్పింది. 'ఇప్పుడే పరాక్రమవంతులైన వానర సైన్యమును మీ ముందుకు వెళ్ళమని ఆజ్ఞాపిస్తాను. మీ కట్టడి మేరకు వారు నాల్గు దిశలకూ వెడలి మీ సీతాదేవిని వెదకి కనిబెడతారు. ఆ పిదప రావణునితో యుద్ధమునకు సంసిద్ధమవుదాము' అని సిగ్గుతో కూడిన గొంతులో బదులిచ్చిన కిష్కింధ రాజును, రాముడు మన్నించిన విధమున ఆతని భుజముపై తట్టి, సీతను వెదుక ప్రయత్నించ ఆతనితో ఆలోచన చేసాడు. వారి ప్రణాళిక ప్రకారం వానరసేన సీతను వెదుక నారంభించారు.

దక్షిణ దిశకు హనుమంతుడు, అంగదుడు, జాంబవంతుడు మున్నగువారితో కూడిన ఒక పెద్ద సైన్యము పంపబడింది. హనుమంతునితో సుగ్రీవుడు దక్షిణదిక్కు నందలి భూభాగ ప్రసిద్ధిని గూర్చి తెలియజేసి, "పునీతమైన వేంకటాచలము మీదుగ వెళ్ళండి" ఆ దివ్య కొండలను దర్శించుకున్న పిదప, పాండ్య దేశమందు అగస్త్యముని వర్యులు తపస్సు చేసిన పొదిగై పర్వతమును చుట్టియున్న తామ్రవర్ణి అనబడు నదిని దాటి వెళ్ళినచో మహేంద్రగిరి వచ్చును. ఆ మహేంద్రగిరిని దాటి వెళ్ళినపిదప సముద్రమగుపడును".

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

**అథ ప్రథమోధ్యాయః**

**యోగురుస్సశివః ప్రోక్తో, యశ్శివస్స గురుస్మృతః**
**వికల్పం యస్తుకుర్వీత సనరో గురుతల్పగః 20**

**__పదవిభాగము__** :-

యః-గురుః-సః-శివః-ప్రోక్తః-యః-శివః-సః-గురుః-స్మృతః-వికల్పం-యః-తు-కుర్వీత-సః-నరః-గురుతల్పగః

**__టీక__** :- యః=ఎవరు; గురుః=గురువో; సః=అతడు; శివః=శివుడని; ప్రోక్తః=చెప్పబడెను; యః=ఎవడు; శివః=శివుడో; సః=అతడు; గురుః=గురువని; స్మృతః=సత్యముగా స్మరింపబడుచున్నాడు; (దీనికి) వికల్పం=విరుద్ధ భావమును; యఃతు= ఎవరైతే; కుర్వీత= చేయునో; సః=ఆ; నరః=మానవుడు; గురుతల్పగః= గురుని భార్యతో కూడిన మహాపాపి వంటివాడు.

**__వ్యాఖ్య__** :- "ఎవరు గురువో ఆయనే శివుడని, ఎవరు శివుడో ఆయనే గురుదేవుడని ధర్మశాస్త్రములు తెలుపుచున్నవి. దీనికి వ్యతరేకమైన భావాన్ని ఎవడు కలిగిఉంటాడో వాడు పంచ మహాపాతకములోనొక దానిని, చేసిన వాడౌతున్నాడు. 'గురు' శబ్దానికి అజ్ఞానాంధతమో భాస్కరుడని, గుణాతీతుడు రూపాతీతుడు అని, సర్వశరీరస్థ చైతన్య బ్రహ్మాప్రాపకుడనీ అర్థం, తాను స్వయంగా చైతన్య పరబ్రహ్మా స్వరూపుడైతేనే గాని చైతన్య పరబ్రహ్మాప్రాపకుడు కాలేడు. కనుక గురుదేవుడంటే సర్వవ్యాపక పరబ్రహ్మా చైతన్యమే. ఇక "శివ" శబ్దానికి మాండూక్యోపనిషత్తులో "శాంతం శివమద్వైతం" అని పరబ్రహ్మాగా నిర్వచింపబడింది. "శివః శామ్యతి పరమానంద స్వరూపత్వాత్" అని వివరణ. కనుక "శివ" అన్నా పరబ్రహ్మా చైతన్యమనే అర్థం.

ఈ విధంగా చూస్తే శివుడికీ, గురుదేవుడికీ భేదంలేదు, లేని బేధాన్ని ఎవరు తెచ్చిపెడతాడో వాడు గురువునకు అపకారం చేసిన "మహాపాపి" అంటున్నది గురుగీత.

ఆధునిక కాలంలో గురుతత్వాన్ని విశేషంగా ప్రవచించినవారు శ్రీ కాళీ వనాశ్రమాధిపతులు శ్రీ కాళీ ప్రసాద బాబూజీ మహరాజ్ వారు. వారు

గురువునూ, పరమాత్మనూ పోల్చి చెబుతూ "గురువు ఎవరు? ఆయన లక్షణాలేమిటి? "గు" అంధకారమని, 'రు' అనగా దానిని నిరోధించుట అని, 'గురు' అనగా అజ్ఞానాంధకారమును పోగొట్టు దివ్య ప్రకాశమును సర్వత్రా వ్యాపింపజేయువాడని అర్థము. పైన మనము పరమాత్మ వస్తువుకు చెప్పకున్న లక్షణము కూడ యిదే. కనుక గురుదేవుడు కేవలము పరబ్రహ్మ స్వరూపుడు, కనుకనే "గురుస్సాక్షాత్ పరబ్రహ్మ" అని మనము స్తుతిస్తాము" అని వివరించటం గమనించవలసిన అంశం.

**దుర్లభం త్రిషులోకేషు తచ్ఛృణుష్వ వదామ్యహమ్**
**గురుబ్రహ్మ వినా నాన్యః సత్యం సత్యం వరాననే. 21**

<u>**పదవిభాగము**</u> :-

దుర్లభం-త్రిషులోకేషు-తత్-శృణుష్వ-వదామి-అహం-
గురుబ్రహ్మ-వినా-న-అన్య-సత్యం-సత్యం-వరాననే.

<u>**టీకా**</u> :- హేవరాననే=ఓపార్వతీ; యత్=ఏది; త్రిషులోకేషు=మూడు లోకములలోనూ; దుర్లభం=సులువుగా సాధ్యము కానిదో; తత్=దానిని; వదామి=చెప్పచున్నాను; గురుబ్రహ్మవినా=గురుదేవుడు తప్ప; అన్య= ఇంకొక, వేరొక; సత్యం=సత్యము; న=లేదు (ఇది) సత్యం=సత్యము.

<u>**వాఖ్య**</u> :- "ఓ దేవీ! మూడు లోకములలోనూ దుర్లభమైన విషయం నీకు తెలియజేస్తున్నాను, ఒక్క గురుదేవుడు తప్ప మూడు లోకములలోనూ వేరొక సత్యము లేదు. ఇది సత్యము.

సర్వసారోపనిషత్తు సత్యాన్ని చక్కగా నిర్వచించింది. సత్యం అంటే "త్రికాలాబాధ్యము", "త్రికాలానుస్యూతము", "యదస్తి తత్సత్యం", "ఏకమేవా ద్వితీయం సత్యమ్". "సర్వకల్పనాధిష్టంవా సత్యం" అన్నది. అన్ని కాలాలలోను అనగా భూత భవిష్యద్వర్తమానాలలో అనుస్యూతంగా, సర్వకల్పనలకు అధిష్ఠానంగా ఉండి అద్వితీయమైన తత్వమేదో అదే సత్యము. అలా ఉన్నదే చైతన్యము, ఆ చైతన్యమే గురుస్వరూపము. దానికి భిన్నమైన మరొక వస్తువును మూడులోకములలోనూ చూడటము దుర్లభమనీ, అందుచేత గురుదేవుడొక్కడే పరమ సత్యమనీ యీ శ్లోకంలో నొక్కి చెబుతున్నాడు పరమేశ్వరుడు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

22. మరొక సందర్భంలో బందా తాతయ్యగారు శ్రీ బాబుతో "బాబూ! మహాత్ములను గురించి ప్రస్తావించేటపుడు, సామాన్యంగా వీరు శివాంశ సంభూతులని, వీరు విష్ణంశ సంభూతులని, వీరు కుమారస్వామి అంశ వారని, వీరు గణపతి అంశ వారని యిలా చెబుతూ ఉంటారు. కాని బ్రహ్మ, విష్ణు, శివ, శ్రీరామ, శ్రీకృష్ణ, జగన్మాత ప్రత్యక్ష దర్శనములన్నిటిని మీలోనే పొందిన భక్తులున్నారు. ఇది ఆశ్చర్యంగా ఉన్నది బాబూ!" అన్నారు.



శ్రీ బాబు నవ్వుతూ "నాలో ఎవరేమి దర్శించారో నాకు తెలియదు గాని, ఒక్కటి మాత్రం నిజం. జ్ఞాని అఖండ చైతన్య స్వరూపుడు. ఆ చైతన్యం ఏ బొమ్మనైనా ప్రకాశింప జేస్తుంది. నువ్వు కరంటువై ఉంటే, ఏ రంగు బల్బునైనా వెలిగించగలవు. అయితే నువ్వు కరెంటు అయి ఉండాలన్నది ముఖ్యం. అలాగే నువ్వు సర్వాధిష్ఠాన చైతన్య స్వరూపుడవైతే ఎన్ని రూపాలైనా నీలోనే ప్రకాశిస్తాయి. కురుక్షేత్రంలో శ్రీకృష్ణపరమాత్ముడు అర్జునునికి చూపించిన విశ్వరూపంలో దేవతలు, మానవులు, దానవులు, చరాచర సృష్టి అంతా ప్రకాశించింది. అర్జునుడు కూడా తనను తాను ఆ రూపంలో దర్శించుకున్నాడు. ఆ ప్రభువు అన్నిటికి మూలమైన సర్వాధిష్ఠానమైన పరబ్రహ్మ మూర్తి కావటమే దానికి కారణం" అన్నారు.

23. చల్లా కృష్ణమూర్తిగారు భీమవరం తాతయ్యగారి యింటికి ఎదురుగా ఉన్న యింట్లో ఉండేవారు. పరశురామయ్యగారి అల్లుడుగా ఆయన శ్రీ బాబుకు బావమరిది వరుస గనుక, శ్రీ బాబు, కృష్ణమూర్తిగారు ఎంతో సన్నిహితంగా ఛలోక్తులతో, చమత్కారాలతో ఒకరినొకరు అలరించుకునేవారు.

ఒకరోజు రాత్రి శ్రీబాబు తాతయ్యగారింటి అరుగు మీద కూర్చొని భక్తులతో మాట్లాడుతున్నారు. సీతారామయ్యగారు కూడా ఉన్నారు. సమయం రాత్రి పన్నెండు గంటలు. ఎదురింటి అరుగుపైన కృష్ణమూర్తిగారు మంచం మీద పడుకుని గుర్రు పెట్టి నిద్రపోతున్నారు. శ్రీ బాబు నలుగురు కుర్రవాళ్ళను పంపి, కృష్ణమూర్తిగారికి తెలియకుండా, వారిని ఆ మంచమునకు కట్టేసి, మంచం మొత్తము ఎత్తుకుని వచ్చి

తాతయ్యగారింటి రెండవ అరుగు మీద పెట్టమని, కృష్ణమూర్తిగారికి ఏ మాత్రం నిద్రాభంగం కలిగించరాదని చెప్పి పంపారు. ఆ కుర్రవాళ్ళు అక్షరాలా శ్రీబాబు చెప్పినట్లే చేశారు. శ్రీ బాబు ప్రక్క అరుగుమీదనే కూర్చొని యించుమించు తెల్లవారుఝామున మూడు గంటల వరకు మాట్లాడారు. చప్పుళ్ళు చేశారు. బిగ్గరగా నవ్వటం, మాట్లాడటం, ఎన్ని చేసినా కృష్ణమూర్తిగారు లేవలేదు. శ్రీ బాబు ఆ కుర్రవాళ్ళను కర్రలు పట్టుకుని రమ్మని "దొంగలు, దొంగలు" అని బిగ్గరగా అరుస్తూ హడావిడిగా అటూ యిటూ పరుగెత్తమన్నారు. ఆ గోలకు కృష్ణమూర్తిగారు మేలుకొని "ఎక్కడ? ఎక్కడ?" అంటూ లేవబోయారు. కాని మంచానికి కట్టి ఉన్నందువలన లేవలేకపోయారు.

కృష్ణమూర్తిగారు కోపంగా "ఎవడ్రా? ఈ పని చేసింది?" అని అంటూ అరిచారు. కుర్రవాళ్ళు ఏమీ ఎరుగనట్లు వెళ్ళి "ఆ దొంగ వెధవలు మిమ్మల్ని మంచానికి కట్టి కూడా తెచ్చారా? మేము లోపల పడుకుని ఉంటే, అరుగు మీద ఏదో చప్పుడైంది. బయటకు వచ్చి చూసేసరికి నలుగురు మనుషులు మీ మంచం తెచ్చి యీ అరుగు మీద పెడుతున్నారు. మేము "దొంగలు" అనేసరికి పరుగెత్తి పోయారు" అన్నారు.

అంతలో శ్రీ బాబు అప్పుడే నిద్రలేచినట్లు కళ్ళు నలుపుకుంటూ "ఏమిట్రా ఆ గోల? ఏం జరిగింది?" అంటూ బయటికి వచ్చారు. కుర్రవాళ్ళు "దొంగలు కృష్ణమూర్తి గారిని మంచానికి కట్టి యీ అరుగు మీదకు తెచ్చి పెడుతుంటే చూసి అరిచాము బాబూ!" అన్నారు.

కృష్ణమూర్తిగారు కోపంగా "దొంగలట, దొంగలు. ఎవరో దొంగలు నన్ను మంచానికి ఎందుకు కడతారు? మా అరుగు మీద నుంచి తెచ్చి యీ అరుగు మీద ఎందుకు పెడతారు? ఆ దొంగలెవరో, దొంగల నాయకుడెవరో కూడా నాకు తెలుసు. మీరే యీ కుర్రవాళ్ళతో యీ పని చేయించారు" అన్నారు. శ్రీ బాబు "రామ! రామ! నాకేమీ తెలియదు బావగారూ?" అన్నారు. కృష్ణమూర్తిగారు రామ రామ కాదు, కృష్ణ కృష్ణ. ఆ అవతారంలో యిల్లాంటి అల్లరి పనులు చేశారని విన్నాను గాని యింకా యిప్పుడు కూడా మీరు యిలాంటి కొంటె పనులు చేస్తారని అనుకోలేదు. అసలు దొంగ మీరు, తోడు దొంగలు వీళ్ళు" అన్నారు.

- సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు కథలు -రమణ ప్రసాద్

# భక్త రామదాసు

తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరుకూ

ప్రక్కతోడుగా భగవంతుడు మన ఛత్రధారి అయి చెంతనెయుండగ॥

అని పాడుకున్నాడు.

అన్ని చోట్లనుండి శిస్తు వసూలైనా భద్రాచలంనుండి పైకం రాకపోవటం గమనించి మంత్రులైన మేనమామలు విచారణ చేయగా, భద్రాచలం శిస్తు ఆరు లక్షలు బకాయి ఉన్నట్లు తెలిసింది. శిస్తు వెంటనే కట్టమని మేనల్లుణ్ణి హెచ్చరించారు. "రాముని దయవుంటే పైసా బాకీ లేకుండా చెల్లిస్తాను" అని బదులు పంపాడు.



"ఒక వైపు మంచి పనిచేశాను" అని ఆనందంలో ఉన్న రామదాసుని చూసి ఓర్వలేని కొందరు గోపన్న నేరాన్ని తానీషాకు చెప్పారు. తానీషా మండిపడి రామదాసును బంధించి తీసుకు రమ్మని భటులను పంపాడు. రామదాసు రామునితో ఇలా మొర పెట్టుకున్నాడు –

ఏతీరుగ నను దయ చూచెదవో యిన వంశోత్తమ రామా

నా తరమా భవ సాగరమీదను నళిన దళేక్షణ రామా

వాసవనుత రామదాస పోషకా వందనమయోధ్యరామా

దాసార్చిత మా కభయమొసంగవె దాశరథీ రఘురామా.

గోపన్న గారు దేహము అనిత్యమని తలచి తానీషా హుకుంని చూచి శ్రీరాములను ఆ విధంగా స్తుతిస్తున్నాడు.

పోకన్మానదు దేహమే విధమున్ బోషించి రక్షించినన్

రాకన్నానదు హాని వృద్ధులు మహారణ్యంబులో దాగినన్
గాకన్నానదు పూర్వజన్మ కృతమున్ గాగల్గు నర్థంబులన్
లేకన్నానునే యెంత జాలిపడినన్ లేముల్, సిరుల్ రాఘవా

"ఓ భద్రాధీశ్వరా నేను పూర్వం చేసిన ఏ కర్మ శేషమో, మీ కరుణకు పాత్రుడిని కానందు వలన ఈ దుర్మతులచే కొట్టించదగునా రామా? అని ఈ విధంగా స్తుతిస్తున్నాడు.

"ఏమిరా రామా నా వల్ల నేరమేమిరా రామ
ఏమి రామా ఈలాగు కష్టము! నీ మహిమో, నా ప్రారబ్ధమో
సదయ హృదయ నీ మృదు పదములు నా హృదయ కమలమును
వదలక నిల్పెద ॥ఏమిరా॥
రామ రామ భద్రాచల సీతారామ దాసుని ప్రేమతో నేలవే ॥ఏమిరా॥"

"స్వామీ నీ కిటుల చేయుట తగదు నన్ను రక్షింప"మని వేడుకున్నాడు.

"ఎవరినడిగి ఖర్చు పెట్టావు?" అని పాదుషా నిలదీశాడు. "ఈ ధనం నాకోసం కాదు ప్రభువువారి ఏలుబడిలోని భద్రాద్రి రాముని ఆలయ పునరుద్ధరణ కోసం ఖర్చు చేసి మీ కీర్తి అజరామరమై నిలచేటట్లు చేశాను" అని సంజాయిషీ ఇచ్చుకున్నాడు రామదాసు.

పాదుషా లోపల కొంత ఆనందించినా, "ప్రభుత్వ ధనం స్వతంత్రించి ఖర్చు పెట్టటం గొప్ప నేరం. పన్నెండు రోజులలో ఆరు లక్షల పైకాన్ని చెల్లించమ"ని ఆజ్ఞాపిస్తూ ఈ గడువు కాలంలో అతన్ని బందీగా చెరసాలలో వేయమని ఆజ్ఞాపించాడు. చెరసాలలో అతనికి తినటానికి పావుశేరు బియ్యం పావుశేరు ఉప్పు కలిపి జైలులోకి విసిరారు. దివ్యమైన రామ నామామృత స్మరణామృతంతో వాటిని పాకం చేస్తే మధురమైన పాయసంగా తయారైంది.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## మార్చి 12 నుండి 17 వరకు భీమవరంలో జరిగిన శ్రీ కాళీవనాశ్రమ శాఖ ప్రారంభోత్సవ దృశ్యములు.



సామూహిక
కుంకుమ పూజలు



శ్రీ సద్గురు లక్ష్మీనారాయణ
నక్షత్రేష్టి విశ్వశాంతి
మహాయాగం



శ్రీ సద్గురు మూర్తి క్షీర
శిలా విగ్రహ యంత్ర ప్రతిష్ఠ



ఆశ్రమ శాఖ యందు
ప్రతిష్ఠింపబడిన
దేవతా మూర్తులు

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## మార్చి 12 నుండి 17 వరకు భీమవరంలో జరిగిన
## శ్రీ కాళీవనాశ్రమ శాఖ ప్రారంభోత్సవ దృశ్యములు



ఆశ్రమ శాఖ యందు
ప్రతిష్ఠింపబడిన
దేవతా మూర్తులు



శ్రీ సద్గురు మూర్తి
ప్రతిష్ఠానంతరం
శ్రీ సద్గురు పాదపూజ



శిఖర ప్రతిష్ఠ

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.